
భీమవరం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 37.0
కనిష్ఠం : 22.0

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : 6:19 (శుక్ర)
సహరి : 4:55 (శని)

జిల్లాలో దేవాలయాల అభివృద్ధి, ఆలయాల్లో సమస్యల పరిష్కారమే ధ్యేయంగా చర్యలు తీసుకుంటున్నట్లు దేవదాయ ధర్మదాయ శాఖ జిల్లా అధికారి ఈవీ సుబ్బారావు భరోసా కల్పించారు. జిల్లా కార్యాలయంలో గురువారం ఉదయం 10 నుంచి 11 గంటల మధ్య 'ఆంధ్రజ్యోతి ఫోన్ ఇన్' కార్యక్రమం జరిగింది. దీనికి విశేష స్పందన లభించింది. జిల్లాలోని ప్రజలు, భక్తులు ఆలయాల సమస్యలను ఆంధ్రజ్యోతి ద్వారా ఫోన్‌లో అధికారి దృష్టికి తీసుకువచ్చారు. వీటిలో కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరించారు.
భీమవరం టౌన్, (ఆంధ్రజ్యోతి)






భీమవరంలో చేపల చెరువుగా మారిన సోమగుండం చెరువు

దేవాలయాల సమస్యలు పరిష్కరిస్తాం

ఆంధ్రజ్యోతి ఫోన్ ఇన్ కార్యక్రమంలో దేవదాయ ధర్మదాయ శాఖ జిల్లా అధికారి సుబ్బారావు హామీ



జిల్లాలో 222 మంది అర్చకులకు ధూప, దీప స్కీమ్ అమలు

జిల్లాలో 222 మంది అర్చకులకు ధూప, దీప, నైవేద్యాల స్కీమ్ కింద ఆర్థిక సాయం అందిస్తున్నాం. 6-సి దేవాలయాలకు రూ.10 వేలు, 6-బీ దేవాలయాలకు రూ.15 వేలు నేరుగా అర్చకుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నాం. అర్చులకు నిధులు జమ కాకపోతే సంప్రదిస్తే సమస్యను పరిష్కరిస్తాం.

దేవాలయాల్లో నూరుశాతం ప్లాస్టిక్ నిషేధం

అన్ని దేవాలయాల్లో నూరుశాతం ప్లాస్టిక్ నిషేదం అమలుకు చర్యలు తీసుకున్నాం. శివరాత్రి సందర్భంగా ఆలయంలోకి ప్లాస్టిక్ కవర్లలో పూజా సామగ్రి తీసుకురాకుండా చర్యలు చేపట్టాం. కొంతమేర అరికట్టగలిగాం. ప్రతీ దేవాలయంలోనూ భక్తులకు తెలిసే విధంగా బోర్డులు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటాం. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నూరుశాతం అమలు చేస్తాం.
- ఈవీ సుబ్బారావు
దేవదాయ, ధర్మదాయ శాఖ జిల్లా అధికారి

దేవతామూర్తుల ఫొటోలు తీయొద్దు

ఆచంట నియోజకవర్గం

● ప్రముఖ దేవాలయాల్లో మూల విరాట్‌ల ఫొటోలు, వీడియోలు తీయడం నిషేధించాలి. ఆగమశాస్త్రానికి విరుద్ధం.
- రామ్మోహనరావు, పెనుమంట్ర

అధికారి : మూల విరాట్‌ల ఫొటోలు తియ్యకుండా చూడాలని, ప్రాంగణాల్లో బోర్డులు ఏర్పాటు చేసి అవగాహన కల్పించాలని ఈవోలు, సిబ్బందిని ఆదేశించాం.

ఆలయానికి పొలం ఉందా ? లేదా ?

● ఎస్.ఇల్లిందలపర్రులో అగస్త్యేశ్వర, రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయానికి గతంలో దాత రెండు ఎకరాల పొలం రాశారని చెబుతున్నారు. అది ఉందా లేదా అనేది తెలియడం లేదు. ఆలయ ప్రహరీలు బీటలు తీశాయి.. మరమ్మతులు చేయించండి
- కోట రామచంద్రమూర్తి-ఎస్.ఇల్లిందలపర్రు



ఎస్.ఇల్లిందలపర్రు ప్రహరీ

అధికారి : ఆలయ ఈవోకు సమాచారం అందించి, పొలం వివరాల వాస్తవ పరిస్థితిని తెలుసుకుని చర్యలు తీసుకుంటాం. ప్రహరీ మరమ్మతులు చేయించేలా చూస్తాం.

వాహన శాల పడిపోతోంది..

● పాలమూరులో పట్టాభి రామస్వామి దేవస్థానంలో నిర్మించిన వాహన శాల శిథిలావస్థకు చేరింది. నూతన భవన నిర్మాణం చేయాలి. ఆలయం ఎదుట డ్రెయినేజీ వ్యవస్థ దారుణంగా ఉంది.
- తుపాకుల గోవిందరావు, పాలమూరు



శిథిలావస్థలో వున్న వాహనశాల

అధికారి : నూతన భవన నిర్మాణాన్ని పరిశీలిస్తాం. వాహనాల రక్షణకు చర్యలు తీసుకోవాలని ఈవోకు ఆదేశిస్తాం. డ్రెయినేజీ సమస్యపై చర్యలు తీసుకుంటాం.

కౌలు వసూళ్ల దృష్టి పెట్టండి

● నత్తారామేశ్వరంలో రామలింగేశ్వరస్వామి దేవస్థానానికి సంబంధించి కౌలు వసూళ్ల లేకపోవడంతో వేలాది రూపాయల ఆదాయం కోల్పోతుంది. చర్యలు తీసుకోండి
- టి.వాణి, వెలగలవారిపాలెం

అధికారి : ఆలయ ఈవో నుంచి బకాయిలపై వివరాలు అడిగి వెంటనే వసూళ్లకు చర్యలు తీసుకుంటాం.

మండపం పెచ్చులూడుతున్నాయి

● మాముడూరు జగదీశ్వర స్వామి ఆలయంలోని మండపం పెచ్చులు ఊడుతున్నాయి.
- దిరిశాల ప్రసన్నంజనేయులు- మాముడూరు

అధికారి : ఆలయ ఈవోతో మాట్లాడి మండపం మరమ్మతులకు చర్యలు తీసుకుంటాం.

మావుళ్లమ్మ ఆలయ రోడ్డులో ట్రాఫిక్ ఇబ్బందులు

భీమవరం నియోజకవర్గం

మావుళ్లమ్మ ఆలయం రోడ్డులో విపరీతమైన ట్రాఫిక్ ఉంటోంది. భక్తులు ఆలయం నుంచి బయటకు వచ్చి ప్రసాదం కొనుగోలుకు ఇబ్బందులు పడుతున్నారు.
- సత్యనారాయణ మూర్తి, 21 వవార్డు

అధికారి : ఈ సమస్యలపై జేసీ టి.రాహుల్‌కుమార్ రెడ్డి ప్రత్యేక దృష్టిపెట్టారు. సమస్యను ఆలయ సహాయ కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తాను.

చంద్రపుష్కరిణిని పరిరక్షించండి

- చందూరి కామేష్, గునుపూడి

పంచారామ క్షేత్రమైన సోమేశ్వరస్వామి ఆలయానికి ఎదురుగా ఉన్న చంద్రపుష్కరిణి (సోమగుండం) పరిరక్షించండి. ప్రస్తుతం చేపల చెరువుగా మారిపోయింది. గునుపూడి ప్రజలు తాగునీరుగా వాడేవారు. చెరువు పవిత్రతను కాపాడాలి.

అధికారి : ఈ విషయంపై సంబంధిత ఆలయ ఈవోకు తెలియజేస్తాం. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి చర్యలు చేపడతాం.



మావుళ్లమ్మ ఆలయం వద్ద ట్రాఫిక్

» ఆలయాల అభివృద్ధే దేవదాయ ధర్మదాయ శాఖ లక్ష్యం
» ఇప్పటికే దేవాలయాల్లో దేవతామూర్తుల ఫొటోలు తీయడం నిషేధం
» అన్ని దేవాలయాల్లో ప్లాస్టిక్ నిషేధానికి చర్యలు
» ఆంధ్రజ్యోతి ఫోన్ ఇన్‌కు విశేష స్పందన



దేవదాయ ధర్మదాయ శాఖ జిల్లా కార్యాలయం

వేణుగోపాలస్వామికి పూర్వవైభవం తేవాలి

వీరవాసరం మండలం కొణితివాడ వేణుగోపాలస్వామి ఆలయానికి 44 ఎకరాల పొలం ఉంది. గతంలో ఉత్సవాలు ఘనంగా జరిగేవి ఇప్పుడు తూతూ మంత్రంగా జరుపుతున్నారు. ఆలయానికి పూర్వవైభవం తెచ్చేలా చూడాలి.
- ఇమ్మలరాజు నరసింహరాజు, కొణితివాడ



వేణుగోపాలస్వామి

అధికారి : దేవస్థానం ఆదాయంపై పూర్తి సమాచారం తెలుసుకుని కార్యక్రమాలు జరిగేలా చూస్తాం. ఈవోకు ఆదేశాలు జారీచేస్తాం.

జీతం పెంచేలా చూడండి

ఉండి నియోజకవర్గం

మా తండ్రి వాడపల్లి శేషాచార్యులు మోగల్లులోని మదన గోపాలస్వామి ఆలయంలో అర్చకుడిగా పనిచేస్తున్నారు. రూ.5 వేలు జీతం వస్తోంది. ప్రభుత్వ నిర్ణయం ప్రకారం జీతం పెంచండి.
- వాడపల్లి వెంకట వర ప్రసాద్, మోగల్లు

అధికారి : ధూప దీప నైవేద్యాల పథకంలో రూ.5వేలుతో పాటు అదనంగా రూ.9,653 బ్యాంకులో వేస్తున్నాం. నగదు జమకాకపోతే కార్యాలయానికి వచ్చి కలవాలి.

పంట భూమిని కాపాడండి

పెన్నాడ వేణుగోపాల స్వామి దేవస్థానంకు ఐదు ఎకరాల పొలం ఉంది. చుట్టుపక్కల చెరువులు తవ్వడం వల్ల పొలం పనికిరాకుండా పోయింది. పైగా అన్యాక్రాంతమైనట్టు సమాచారం. దీనిపై పరిశీలించి చర్యలు తీసుకోండి.
- కునుకు రామకృష్ణ, రామూరి సునీల్ కుమార్ పెన్నాడ అగ్రహారం

అధికారి : ఆలయ ఈవోతో మాట్లాడి ఆలయ భూమి పరిరక్షణకు చర్యలు తీసుకుంటాం. అన్యాక్రాంతంపై వాస్తవ పరిస్థితిని ఆరా తీస్తాం.

అన్యాక్రాంత భూముల వివరాలివ్వాలి

తణుకు నియోజకవర్గం

గత ఏడాది క్రితం జిల్లాలో అన్యాక్రాంత దేవాలయాల భూముల వివరాలు, ఆక్రమణ వివరాలు కోరా.. ఇంతవరకు సమాచారం లేదు.
- దుర్గారెడ్డి, తణుకు

అధికారి : దేవాలయాలకు సంబంధించి సమాచార హక్కు చట్టం కింద వివరాలివ్వడం కుదరదు. ఏ దేవాలయాలకు సంబంధించి వివరాలు కావాలో నేరుగా ఆలయ ఈవోతో సంప్రదిస్తే అందిస్తారు.



డ్రా తీసిన టోకెన్‌ను చూపిస్తున్న జేసీ

పారదర్శకంగా 18 మద్యం షాపుల లాటరీ

» జేసీ రాహుల్‌కుమార్ రెడ్డి

భీమవరంటౌన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) :రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలో గీత కులాలకు కేటాయించిన మద్యం షాపులు కేటాయింపు ప్రక్రియను అర్జీదారుల సమక్షంలో పారదర్శకంగా లాటరీ పద్ధతి ద్వారా పూర్తి చేశామని జిల్లా జాయింటు కలెక్టరు టి.రాహుల్ కుమార్‌రెడ్డి తెలిపారు. గురువారం జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని గీత కులాలకు కేటాయించిన 18 మద్యం షాపులకు లాటరీ ప్రక్రియను టోకెన్ల ద్వారా స్వయంగా ఆయన లాటరీ తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు కోడ్ కారణంగా వాయిదా పడిన గీత కులాలు మద్యం షాపుల కేటాయింపుల లాటరీ ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేశామన్నారు. జిల్లాలోని 18 మద్యం షాపుల కోసం మొత్తం 478 దరఖాస్తులు అందాయని, ఈ లాటరీ ద్వారా 18 షాపులు కేటాయించామని, రెండు నెలలు ఫీజు రూ.95,83,333 రుసుం జమ చేసిన తరువాత షాపులను కేటాయిస్తామన్నారు. శెట్టిబలిజ-10, గౌడ-5, గౌడ్‌లు-2, శ్రీశయిన ఒక షాపును కేటాయించామన్నారు. మొత్తం 478 దరఖాస్తులకు గాను రూ.9 కోట్ల 56 లక్షలు నాన్ రిఫండబుల్ కింద ప్రభుత్వానికి జమ అయిందన్నారు. మొత్తం ప్రక్రియ వీడియో లైవ్ స్ట్రీమింగు ఇవ్వడంతో పాటు, పక్కాగా రికార్డు చేశామన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ అసిస్టెంటు కమిషనరు కేవీ నాగప్రభుకుమార్, జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంటు డాక్టర్ ఆర్.ఎస్ కుమారేశ్వరన్, సహాయ ఎక్సైజ్ అధికారి ఆర్‌వీ ప్రసాద్‌రెడ్డి, ఎక్సైజ్ శాఖ, పోలీసులు, అర్జీదారులు పాల్గొన్నారు.



ప్రమాద స్థలిని పరిశీలిస్తున్న పోలీసులు

విషాద జర్నీ..

» ఆగి వున్న లారీని ఢీకొన్న ప్రైవేటు ట్రావెల్ బస్సు
» బస్సు డ్రైవర్‌తో సహా ముగ్గురి మృతి
» 21 మందికి తీవ్ర గాయాలు..
» చొదిమెళ్ల వద్ద ప్రమాదం

ఏలూరు క్రైం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : జీవనోపాధికి తమ స్వగ్రామాలను విడిచి మహానగరానికి వెళ్లారు. వీరందరూ వివిధ పనుల నిమిత్తం స్వగ్రామాలకు వస్తూ మార్గమధ్యలోనే మృతి చెందడంతో ఆ కుటుంబాల్లో విషాదాన్ని నింపింది. వివరాలివి.. హైదరాబాద్ నుంచి కాకినాడకు రమణ ట్రావెల్స్ బస్సు బుధవారం రాత్రి 34 మంది ప్రయాణికులతో బయలు దేరింది. ఏలూరు సమీపంలోని చొదిమెళ్ల వద్ద జాతీయ రహదారిపై గురువారం తెల్లవారుజామున జరిగిన హైదరా బాద్ నుంచి కాకినాడ వస్తున్న రమణ ట్రావెల్స్ బస్సు ఆగి వున్న లారీని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ప్రైవేటు బస్సు డ్రైవర్‌తో పాటు ముగ్గురు ప్రయాణికులు మృతి చెందగా మరో 21 మంది తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను ఏలూరు ప్రభుత్వాసుపత్రికి హైవే పెట్రోలింగ్ టీమ్ తరలించారు.

జాతరకు వస్తూ..

భీమడోలులోని గుర్రాల చెరువునకు చెందిన బొంతు భీమేశ్వ రరావు(43)కు భార్య వెంకటలక్ష్మి, కుమారుడు పార్థసారథి విజయవాడ చైతన్య జూనియర్ కాలేజీలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు రాస్తున్నాడు. కుమార్తె జేష్ఠవి 9వ తరగతి చదువుతోంది. భీమేశ్వరరావు హైదరాబాద్‌లో పెయిం టింగ్ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. తమ గ్రామంలో ఈనెల 9వ తేదీ నుంచి జాతర ఉండడంతో గ్రామానికి రావాలని బంధువులకు ఫోన్లు చేసి ఆహ్వానించారు. హైదరాబాద్‌లో బయలుదేరిన భీమేశ్వరరావు గత రెండు నెలల నుంచి కష్టపడిన సొమ్మును తన బ్యాగ్‌లో పెట్టుకుని బయలుదేరుతూ భీమడోలులో ఉన్న తన కుమార్తెతో మూడుసార్లు ఫోన్‌లో మాట్లాడి కేక్ తీసుకొస్తున్నానన్నాడు. ఎన్నిసార్లు ఫోన్ చేసినా స్పందన లేదు. చివరకు పోలీసులు ఫోన్ చేసి ఆస్పత్రికి రావాలని చెప్పడంతో అక్కడకు చేరుకున్న వారు భీమేశ్వరరావు మృతదేహాన్ని చూసి తల్లడిల్లిపోయారు.

బంధువుల ఇంట్లో పెళ్లికి వస్తూ..

కాకినాడ జిల్లా కాజులూరు మండలం కాలావారిపేట పల్లిపాలానికి చెందిన జుత్తిగ భవాని (38)కి భర్త చిన అప్పారావు, ఇద్దరు కుమారులు ఉన్నారు. కొంతకాలం నుంచి హైదరాబాద్‌లోనే ఉంటున్నారు. బంధువుల ఇంట్లో జరుగుతున్న వివాహానికి ఆమె హాజరయ్యే నిమిత్తం బయలుదేరి వస్తూ మార్గమధ్యలో మృత్యువాత పడింది.

విగ్రహ ప్రతిష్ఠకు వస్తూ..

కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం కాత్రావిపల్లికి చెందిన మటపర్తి భవాని (23) హైదరాబాద్‌లోని టీసీఎల్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేస్తోంది. ఆమె తండ్రి రైతు. తల్లి గృహిణి. సోదరుడు డిగ్రీ చదువుతున్నాడు. గ్రామంలో విగ్ర ప్రతిష్ఠ కార్యక్రమానికి హాజరయ్యే నిమిత్తం హైదరాబాద్ నుంచి బయలుదేరి బస్సులో వస్తూ మృత్యువాత పడింది.



నుజ్జునుజ్జైన బస్సు



ధ్వంసమైన లారీ

● రమణ ట్రావెల్ బస్సు డ్రైవర్ కాకినాడకు చెందిన ముంగంటి మధుసూదన్ (38) మృత్యువాత పడ్డాడు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతను ఏలూరు ప్రభుత్వాస్పత్రిలో కొట్టుమిట్టాడుతూ కొద్ది సేపటిలోనే మృత్యువాత పడ్డాడు. అతని పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

క్షతగాత్రులు వీరే..

ప్రమాదంలో 21 మంది తీవ్ర గాయాలయ్యారు. వీరిలో ముగ్గురు పిల్లలు, తొమ్మిది మంది మహిళలు ఉన్నారు. కోలా సురేఖ, కోలా రాజబాబు, కోలా లిఖిత, పనమనీడి ఆదిలక్ష్మి, మద్దాల కీర్తి, మాచర్ల సుజాత, మండపాక బాలాజీ, మండపాక శ్రీదేవి, మండపాక హరిణి, మండపాక శశిరేఖ, ఆర్నాలకంటి శ్రీలక్ష్మి, కోట వేణి, జి.మణికంఠ (క్లీనర్)పువ్వుల శ్యామ్‌కుమార్, శీలం ప్రకాష్, ఎం.ప్రతాప్, పి.అక్కమ్మ, పి.హేమలత, గొణజ విజయ్‌కుమార్, రామిశెట్టి సోమసత్యనారాయణ, టి.రవికుమార్ గాయాలపాలయ్యారు.

మంత్రులు, ఎంపీ మహేష్‌కుమార్ దిగ్భ్రాంతి

ప్రైవేటు బస్సు ప్రమాదంపై రాష్ట్ర మంత్రులు కొలుసు పార్థసారథి, నాదెండ్ల మనోహర్, ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదంతో మరణించిన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ప్రమాద ఘటన గురించి జిల్లా అధికార యంత్రాంగాన్ని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం బాధిత కుటుంబాలకు అండగా ఉంటుందని, వారికి వసరమైన సహాయ సహకారాలు అందిస్తామన్నారు. రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలకు గురైన క్షతగాత్రులను కలెక్టర్ వెట్రిసెల్వి పరామర్శించారు. వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ ఆదేశించారు.



గోకర్ణపురంలో అటవీశాఖ అధికారులతో మాట్లాడుతున్న బలే ఏసురాజు

కొల్లేరులో ఉద్రిక్తత

» చేపల చెరువు గట్లను ధ్వంసం చేసేందుకు అటవీశాఖ అధికారుల యత్నం
» అడ్డుకున్న గోకర్ణపురం గ్రామస్థులు

కైకలూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): కొల్లేరులో చేపల చెరువులను ధ్వంసం విషయంలో గ్రామస్థులకు, అటవీ శాఖ అధికారుల మధ్యన కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. గురువారం ఏలూరు జిల్లా శృంగవరప్పాడు శివారు గోకర్ణపురంలో కొల్లేరు అభయారణ్యంలో చేపల చెరువులను ధ్వంసం చేసేందుకు కైకలూరు అటవీశాఖ రేంజర్ రామలింగాచార్యులు తన సిబ్బందితో వెళ్లారు. విషయం తెలుసుకున్న గ్రామస్థులు పెద్దఎత్తున అక్కడికి చేరుకుని కొల్లేరులో ఎక్కడా తామ చేపల చెరువులు తవ్వలేదని 2006 కొల్లేరు ఆపరేషన్‌లో ధ్వంసం చేసిన చెరువుల్లో అరకొర ఉన్న నీటిలో ఉన్న చేపలను పట్టుకొని జీవనం సాగిస్తున్నామని వాటిని ధ్వంసం చేసి జీవనోపాధిని దెబ్బతీయవద్దని కోరారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు కొల్లేరు అక్రమ చెరువులను ధ్వంసం చేయవలసిందేనని అటవీశాఖ అధికారులు పట్టుబడడంతో కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. రాష్ట్ర టీడీపీ వడ్డీ సాధికారిక సమితి కన్వీనర్ బలే ఏసురాజు సంఘటన స్థలానికి చేరుకుని అటవీశాఖ అధికారులను సముదాయించేందుకు ప్రయత్నించారు. అటవీశాఖ అధికారులు ససేమిరా అనడంతో ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ దృష్టికి విషయాన్ని తీసుకువెళ్లారు. మరో రెండు నెలల పాటు అవకాశం ఇస్తే అరకొర నీటిలో ఉన్న చేపలను పట్టుబడి చేసుకుంటామని అప్పటివరకు అధికారులు తమకు అవకాశం కల్పించాలని ఏసురాజు వివరించారు. రెండు నెలల సమయం ఇచ్చేందుకు అవకాశం లేదని ఇప్పటికే కోర్టు ఆదేశాలను ఆచరించాల్సిన పరిస్థితులన్నాయని అటవీశాఖ అధికారులు చెప్పారు. ప్రభుత్వం సుప్రీం కోర్టులో ప్రత్యేక పిల్ వేయనుందని అప్పటివరకు అధికారులు చెరువుల జోలికి రాకుండా ఆగాలని కోరారు. దీంతో అధికారులు వెనుదిరిగారు. జనసేన నాయకుడు కొల్లి వరప్రసాద్, కొల్లేరు లంక గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, మాజీ ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. అనంతరం కైకలూరు పోల్‌రాజ్ డ్రైనేజీ సమీపంలో కాంటూరు పరిధిలోని 16 ఎకరాల అక్రమ చేపలచెరువును ధ్వంసం చేసినట్లు డీఆర్‌వో రంజిత్‌కుమార్ తెలిపారు.

వేసవి గట్టెక్కేనా ?

వెంటాడుతున్న తాగునీటి కష్టాలు

8

ఆంధ్రజ్యోతి ఫోకస్

వేసవి గట్టెక్కేనా ?

వేసవి వచ్చేసింది..ఇక నీటి కష్టాలు వెంటాడతాయి.. చెరువులు అడుగంటడం, మోటార్లు మొరాయించడం, పైప్‌లైన్లు లీకేజీ, సమ్మర్ స్టోరేజీ ట్యాంకు సమస్యలతో తాగునీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తుతుంటాయి. ఏటా వేసవి కాలంలో గ్రామాల నుంచి పట్టణాల వరకు దాహం కేకలు వినిపిస్తాయి.. పట్టణాల్లో తాగునీటి సమస్యలు.. నివారణ చర్యలపై ఆంధ్రజ్యోతి ఫోకస్


దెందులూరు సమ్మర్ స్టోరేజీ ట్యాంక్‌లో అతి తక్కువగా నీటి మట్టం


నూజివీడు మంచినీటి సరఫరా పథకం పంప్ హౌస్

రోజు విడిచి రోజు నీటి సరఫరా

నూజివీడు టౌన్ (ఆంధ్రజ్యోతి): నూజివీడు పట్టణంలో తాగునీటి సరఫరా రోజువిడిచి రోజు సాగుతోంది. 2008లో నూజివీడు పట్టణానికి తాగునీటి సరఫరాకు సంబంధించి రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం రూ.57 కోట్లతో కృష్ణాజలాల తరలింపు పథకాన్ని ప్రకటించి పూర్తిచేసింది. అయితే పైప్‌లైన్ ఎలైన్ మెంట్‌లో లోపాలు కారణంగా నెలలో ఏదో ఒకరోజు తాగునీటి సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. పథకం పూర్తయిన నాటినుంచి ఇదే పరిస్థితి నెలకొంది. మరోవైపు పట్టణంలో కృష్ణా జలాలను పూర్తి స్థాయిలో నేటికి అందించలేదు. పట్టణంలోని బాపూనగర్, గొడుగువారి గూడెం ప్రాంతాల్లో తాగునీటి సరఫరా నేటికి డైరెక్ట్ పంపింగ్ సిస్టమ్ ద్వారానే జరుగుతోంది. విజయవాడ నుంచి నూజివీడుకు నీటి సరఫరా జరిగే 51 కిలోమీటర్ల పరిధిలో దాదాపు 10 కి.మీ మేర ఎలైన్‌మెంట్‌లో లోపాలు ఉండటంతో ఆ ప్రాంతంలో కొత్తపైప్‌లైన్ ఏర్పాటుతో పాటు పట్టణంలో 6 వేల గృహాలకు తాగునీరు అందించే విధంగా చర్యలు చేపట్టాల్సి ఉంది. నూజివీడు పట్టణంలో కృష్ణాజలాలు వెళ్ళని, మిగిలిన ప్రాంతాలకు కృష్ణాజలాల తరలింపునకు సంబంధించి అమృత్ పథకంలో భాగంగా దాదాపు రూ.16 కోట్లతో మున్సిపల్ అధికారులు ప్రతి పాదనలు పంపారు. పరిపాలనా ఆమోదం పొంది ఆచరణ లోకి వస్తే నూజివీడు ప్రాంతంలోని అన్ని గృహాలకు నేరుగా కృష్ణా జలాలను అందించే అవకాశం ఉంది. నూజివీడు పట్టణంలో మొత్తం 32 వార్డులు ఉండగా, కేవలం 9 వార్డుల్లో మాత్రమే ప్రతిరోజూ కృష్ణాజలాలను పంపిణీ చేస్తున్నారు. బాపూనగర్, గొడుగువారి గూడెంలలో డైరెక్ట్ పంపింగ్ స్కీమ్ ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నారు. పంప్‌హౌస్‌ల రిపేర్లు, పైప్‌లైన్ల లీకేజీలు వస్తే మాత్రం ఆ నాలుగురోజుల పాటు తాగునీటి సరఫరా నిలిచి పోతోంది.

అమృత్ పథకంలో ప్రతి ఇంటికి నీరు అందేలా చర్యలు

కృష్ణా జలాలను ప్రతిఇంటికి సరఫరా చేయాలనే లక్ష్యంతో అమృత్ పథకంలో భాగంగా 6 వేల గృహాలకు తాగునీరు అందించే లక్ష్యంతో ప్రణాళికలను ఉన్నతాధికారులకు పంపాం. పథకం ఆచర ణలోకి వస్తే పైప్‌లైన్ ఎలైన్‌మెంట్ లోపాలు ఉన్నచోట నూతన పైప్‌లైన్ నిర్మాణం, శివారు ప్రాంతాలకు సైతం కృష్ణాజలాలను అందించే అవకాశం ఉంది.

- వంశీ, మున్సిపల్ ఏఈ, నూజివీడు

అందరికీ అందేదెప్పుడో ?



ఎర్రకాలువ జలాశయం

జంగారెడ్డిగూడెంలో వృథాగా పడి ఉన్న పైప్‌లు

జంగారెడ్డిగూడెం,(ఏలూరు) (ఆంధ్రజ్యోతి): జంగారెడ్డిగూడెం పట్టణంలో పెరుగుతున్న జనాభా ప్రకారం మంచినీటిని అందించ డానికి మున్సిపల్ అధికారులు ఆపసోపాలు పడుతున్నారు. ప్రస్తుతం పట్టణంలో సుమారు లక్ష వరకు జనాభా ఉన్నారు. ప్రతీ ఇంటికీ మంచినీరు అందే పరిస్థితి ప్రస్తుతం లేదు. ఇప్పటికే చాలామంది ప్రజలు బయటి ఆర్వో ప్లాంట్ల దగ్గర నీటిని కొనుగోలు చేస్తున్నారు. ప్రస్తుతం మున్సిపాలిటీ ద్వారా అందించే మంచినీటిలో హైస్కూల్ దగ్గర ఉన్న మంచీనీటి ట్యాంకు, కాలేజీ దగ్గర ఉన్న వాటర్ ట్యాంకు నుంచి వచ్చే నీరు మాత్రమే తాగడానికి రుచికరంగా ఉంటాయి. ఆ నీరు పట్టణ ప్రజలందరికీ చేరడం లేదు.

ఎర్రకాలువ నీటి సరఫరాకు రూ.80.95 కోట్లు

జంగారెడ్డిగూడెం ప్రజలకు పూర్తిస్థాయిలో మంచినీటిని అందించడానికి 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వంలో వరల్డ్ బ్యాంకు నిధులు (ఎఐఐబి) ద్వారా రూ.80.95 కోట్లు మంజూరు చేసింది. జంగారెడ్డిగూడెం మండలం ఎర్రకాలువ జలాశయం నుంచి నీటిని తీసుకుని జలాశయం దగ్గరే రూ.53 కోట్లతో పంపింగ్ మెయిన్ ఏర్పాటు చేసి నీటిని శుద్ధి చేసి జంగారెడ్డిగూడెం వరకు పైప్‌లైన్ వేసి పట్టణంలోని ప్రతీ ఇంటికీ శుద్ధ నీరు ఇవ్వాలని సంకల్పించింది. దాదాపు 5 కిలోమీటర్ల మేర పట్టణంలో పైప్‌లైన్ కూడా వేశారు. 2019లో వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ పథకాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసింది. దీంతో ఈ పనులన్నీ నిలిచి పోయాయి. పైప్‌లైన్‌లో ఉపయోగించే పైపులు పట్టణంలోని అశ్వారావుపేట రోడ్డులో వృథాగా పడి ఉన్నాయి. కూటమి ప్రభుత్వంలో ఈ పథకం మళ్ళీ వెలు గులోకి వచ్చింది. పూర్తి డీపీఆర్ పంపించమని సీఎం చంద్రబాబు ఆదేశాలతో రూ.85.35 కోట్లతో రీ ఎస్టిమేషన్ వేసి పంపించినట్లు జంగా రెడ్డిగూడెం మున్సిపాలిటీ పబ్లిక్ హెల్త్ డీఈ కె.ఫణిభూషణరావు తెలిపారు.

వేసవి దాహార్తిని తీర్చడానికి అన్ని ఏర్పాట్లు చేశాం



ప్రస్తుతం మున్సిపాలిటీ పరిధిలో 33 బోర్లు, తొమ్మిది మంచినీటి ట్యాంకులు ఉన్నాయి. విద్యుత్ కోతలు ఏర్పడినప్పుడు ఇబ్బంది లేకుండా జనరేటర్‌ను అందు బాటులో ఉంచాం. మోటార్లు రిపేరు వచ్చినప్పుడు ఉపయోగించడానికి రెండు స్పేర్ మోటార్లు సిద్ధం చేశాం. కౌన్సిల్ ఆమో దంతో మరో రెండు స్పేర్ మోటార్లు కొనుగోలు చేస్తాం.

- కెవి.రమణ,మున్సిపల్ కమిషనర్, జంగారెడ్డిగూడెం

అథమస్థాయికి నీటిమట్టం

ఏలూరు టూటౌన్ : ఏలూరు నగరానికి తాగునీరు అందించే దెందులూరు సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులో నీటి మట్టం అథమస్థాయికి చేరుకుంది. దీంతో వేసవిలో రెండుపూటలా తాగునీరు సరఫరా ప్రశ్నార్థకంగా మారింది. ఈ ట్యాంకులో నీరు పది అడుగులకు పడిపోయింది. రానున్న 10, 15 రోజులకు మాత్రమే సరిపడా తాగునీరు ఉంది. నగరంలో 3 లక్షల 24 వేల మంది జనాభా ఉన్నారు. ఒక్కొక్కరికి ప్రతీరోజు 135 లీటర్ల తాగు నీరందిస్తున్నారు. 2011 సంవత్సరానికి ముందు తాగునీటి సమస్య ఉంది. 2011లో 117 ఎకరాల్లో తాగునీరు తాగునీరు అందిం చేందుకు చెరువు తవ్వారు. అప్పటి నుంచి నగరప్రజలకు తాగు నీటికి ఇబ్బందులు లేవు. ఈ ఏడాది ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ గోదా వరి కాల్వలో సరిగా నీరు వదలకపోవడం ఒక కారణం అయితే రెండవది కాల్వలో నుంచి చెరువలోకి నీటిని తోడే మోటార్లు మొరాయించడం. ఇరిగేషన్ అధికారులు, మున్సిపల్ అధికారుల సమ న్వయలోపమే ఈ రోజు ఈ దుస్థితికి కారణం. తాగునీటి తీవ్రతను దృష్టిలో పెట్టుకుని బుధవారం అసెంబ్లీలో ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య తాగునీటి సమస్య గురించి వివరించారు. దీంతో జిల్లా కలెక్టర్, ఇరిగేషన్, మున్సిపల్ అధికారులు దెందు లూరు సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును సందర్శించారు.

సరిగా తాగునీరు అందడం లేదు



మూడురోజుల నుంచి తాగునీరు సరిగా అందించడం లేదు. ఏదో ఒకపూట అరకొరగా ఇస్తున్నారు. గతంలో ఎప్పుడు ఇటువంటి పరిస్థితి లేదు. మున్సిపల్ అధికా రులను అడిగితే మరమ్మతులు చేస్తున్నాం అని చెబుతున్నారు. తాగునీటి సరఫరాకు ఇబ్బందులు లేకుండా చూడాలి.

- మాణిక్య ఆనంద్, లంకపేట


సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు పరిశీలిస్తున్న ఏలూరు కలెక్టర్ వెట్రిసెల్వి


తాగునీటి సమస్య రానివ్వకండి : కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరుటూటౌన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో తాగునీరు, సాగు నీటికి ఎటువంటి సమస్య లేకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఏలూరు జిల్లా కలెక్టర్ కే.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. ఏలూరు నగరానికి తాగునీరు అందించే దెందులూరు సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును కలెక్టర్ వెట్రిసెల్వి పరిశీలించారు. గోదావరి కాల్వద్వారా సమ్మర్‌స్టోరేజ్ ట్యాంకును నీటితో నింపేందుకు యుద్ధప్రతిపాదికన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. ఏలూరు నగరంతో పాటు జిల్లాలో ఎక్కడా కూడా తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. చేపల చెరువులకు అక్రమంగా నీటిని మళ్ళించే వారిపై చర్యలు తీసుకోవాలన్నారు.ఇరిగేషన్ ఎస్ఈ నాగార్జునరావు మాట్లాడుతూ ఈనెల 11వ తేదీవరకు కాల్వల్లో నీటిని విడుదల చేస్తామన్నారు. అనంతరం ఈనెల 25 నుంచి ఏప్రిల్ 25 వరకు నీటిని సరఫరా చేస్తామన్నారు. నగరపాలక సంస్థ కమిషనర్ ఏ.భానుప్రతాప్, కోఆప్షన్ సభ్యుడు ఎస్ఎంఆర్ పెదబాబు, ఆర్డీవో అచ్యూత అంబరీష్, జిల్లా వ్యవసాయాధికారి అబీబ్ భాష, జిల్లా మత్స్యశాఖ జేడీ నాగలింగా చార్యులు,ఇంజనీర్లు సుబ్రహ్మణ్యేశ్వర రావు, ఎస్.సుబ్రహ్మణ్యేశ్వరరావు, తహసీల్దార్ సుమతి పాల్గొన్నారు.

కాలం చెల్లిన పైప్‌లైన్లతో ఇబ్బందులు


బోయగూడెం సమీపంలో నిరుపయోగంగా ఉన్న ట్యాంక్

చింతలపూడి, (ఆంధ్రజ్యోతి) : చింతలపూడి నగర పంచా యతీలో పెరుగుతున్న జనాభాకు తగినట్లు నీటి అవసరాలు పెంచాలి. ప్రస్తుతం నగర పంచాయతీలో 50 ఏళ్ల క్రితం నిర్మించిన పైపులైను ద్వారా మంచినీటి సరఫరా జరుగుతుంది. 2006లో మెయిన్ రోడ్డు విస్తరించిన తరువాత రెండో పక్క పైపులైను నిర్మాణం చేయక పోవడంతో మెయిన్ రోడ్డులో ఇప్పటికీ రోజువిడిచి రోజు మంచినీటి సరఫరా చేస్తున్నారు. ఈ ట్యాంకుకు రేచర్ల ఏరియా నుంచి బోరువేసి బోయగూడెం సమీపంలో ఉన్న ఈ ట్యాంకుకు నీరు చేరుతుంది. ఇక్కడే మరో రెండు ట్యాంకుల నిర్మాణం కూడా జరిగింది. ఇవికాక నగర పంచాయతీలో మొత్తం తొమ్మిది ఓవర్‌హెడ్ ట్యాంకులు ఉన్నాయి. పట్టణంలో 8 వేల 850 నివాస గృహాలు ఉండగా, 3,300 ఇంటి కుళాయి కనెక్షన్లు ఉన్నాయి. వీధి కుళాయిలు నిర్వహణ, నీటి దుర్వినియోగంతో ఈ కనెక్షన్లు తగ్గిపోయాయి. ఐదు సచివాలయాల పరిధిలో తొమ్మిది ఓవర్‌హెడ్ ట్యాంక్‌లకు 34 మోటార్లు ద్వారా బోర్ల నుంచి ట్యాంకులకు ఎక్కిస్తారు. ఒక్కొసారి డైరెక్ట్‌గా పంపింగ్ చేసి నీటి సరఫరా ఇస్తుంటారు. పట్టణంలో రోజుకు 4.1 మిలియన్ లీటర్ల మంచీనీరు అవసరం కాగా 2.7 మిలియన్ లీటర్ల నీటిని మాత్రమే సరఫరా చేయగలుగు తున్నారు. 70 మంది వాటర్ వర్క్ నిర్వహణలో పని చేస్తున్నారు. బోయగూడెం, పాతచింతలపూడి, భట్టువారిగూడెం, సుప్రియన్ పేట, వెలమపేట, నందమూరికాలనీ, ఆంథో నినగర్, నాగిరెడ్డిగూడెంలలో ఓవర్‌హెడ్ ట్యాంకుల ద్వారా మంచినీటి సరఫరా జరుగుతుంది.


మాజీ మంత్రి పీతల సుజాత హయాంలో ప్రారంభించిన 90 వేల లీటర్ల ఓవర్‌హెడ్ ట్యాంక్

పైపులైన్లు తరచూ లీకేజీలతో నీరు వృథాగా పోతోంది. బోయగూడెం సమీపంలో నిర్మించిన మూడు ఓవర్‌హెడ్ ట్యాంకులు మెయిన్‌లైనుకు మంచినీటి సరఫరా చేస్తారు. ఈ ఓవర్‌హెడ్ ట్యాంకులకు రేచర్ల సమీపంలో బోర్ల నుంచి పైపులైను ద్వారా ఈ ట్యాంకుల్లో నింపి నీటి సరఫరా చేస్తారు. నీరు తియ్యగా ఉండడం వల్ల ప్రజలు ఈ నీటిని ఇష్టపడుతుంటారు. మిగిలిన ప్రాంతాల వారు కూడా మాకు కూడా రేచర్ల నీరు ఇస్తారా అని అడుగుతుంటారు.

అమృత్ 2.0 పథకం మంజూరు

చింతలపూడి పట్టణానికి అమృత్ 2.0 పథకం మంజూరైంది. దీనిపై మునిసిపల్ కమిషనర్ డి.పావని మాట్లాడుతూ తమ్మిలేరు రిజర్వాయరు నుంచి పట్టణంలో నీరు అందించడానికి నీటిపారుదల శాఖ ఉమ్మడి యాజమాన్యంతో సర్వే జరిగిందని తెలిపారు. ఇందుకు ఐదు ఎకరాల స్థలం కోసం ప్రతిపాదనలు చేశాం. రూ. 42 కోట్లతో ఈ పథకంలో కొత్త లైను ద్వారా నీరు వచ్చే అవకాశం ఉంది. అది పూర్తయితే పట్టణానికి శాశ్వత తాగునీటి సౌకర్యం ఏర్పడుతుంది. ప్రస్తుతం వేసవి ఎద్దడి దృష్టిలో పెట్టుకుని మూడు ట్యాంకర్లను, రెండు విద్యుత్ కొత్త మోటార్లను సిద్ధం చేశామని తెలిపారు.



నేర సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ నయీం అస్మి

నేర నియంత్రణలో సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

పశ్చిమగోదావరి జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి

భీమవరం క్రైం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : కేసుల సత్వర పరిష్కారానికి సాంకేతికతను వినియోగించుకోవాలని పశ్చిమగోదావరి జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి పోలీసులకు సూచించారు.జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలతో గురువారం ఎస్పీ జిల్లా పోలీసు కార్యాలయంలో నేర సమీక్షా సమావేశం నిర్వ హించారు. పెండింగ్ కేసులు, ప్రాపర్టీ కేసులు, రోడ్డు ప్రమాదాలు, పెండింగ్ నాన్ బెయిలబుల్ వారెంట్స్ ఇతర కేసులను సమీక్షించారు. పోలీస్ స్టేషన్ల వా రీగా పాత పెండింగ్ కేసుల వివరాలు, ప్రస్తుత కేసుల స్థితిగతులు, నమోదైన కేసుల్లో దర్యాప్తు తీరుపై సంబంధిత పోలీసు అధికారులను ఆరా తీశారు. వీలై నంత త్వరగా పెండింగ్ కేసులను పరిష్కార దశకు తీసుకురావాలని సూచిం చారు. నేరస్తులు తప్పించుకునే వీలు లేకుండా న్యాయస్థానాలలో తగిన సాక్ష్యా ధారాలు ప్రవేశపెట్టి నేర్తులకు శిక్ష పడే విధంగా కృషి చేయాలన్నారు. జిల్లాలో గుర్తు తెలియని మృతదేహాలు, కారణం తెలియని మరణం కేసులు, అనుమానా స్పద మృతి కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఆయా కేసుల్లో అన్ని కోణాల్లో దర్యాప్తు చేసి పూర్తిస్థాయిలో సాక్ష్యాధారాలు సేకరించాలని ఆదేశించారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానాన్ని పాటిస్తూ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో స్నేహపూర్వ కంగా మెలిగి ఫిర్యాదులను స్వీకరించాలన్నారు. ప్రజలకు పోలీస్ శాఖపై నమ్మ కం పెంపొందించేలా సేవలు అందించాలని సూచించారు. జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) భీమారావు, భీమవరం డీఎస్పీ రావూరి గణేష్ జయసూర్య, నర్సాపురం డీఎస్పీ శ్రీవేద, తాడేపల్లిగూడెం డీఎస్పీ డి.విశ్వనాథ్, జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ వి.పుల్లారావు, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ డి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నిరుద్యోగుల్లో చిగురిస్తున్న ఆశలు

- కూటమి ప్రభుత్వం వర్క్‌ఫ్రమ్ హోమ్ సర్వే
- నిరుద్యోగుల వివరాలు నమోదు

ఏలూరు రూరల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చాకా ఎన్నికల్లో ఇచ్చిన హామీ లను ఒక్కొక్కటి నెరవేరుస్తోంది. నిరుద్యో గులకు ఇచ్చిన హామీని అమలు చేసే దిశగా ప్రయత్నాలు ముమ్మరం చేసింది. దీనిలో భాగంగా గతంలో ఎన్నడూలేని విధంగా ప్రభుత్వం వర్క్‌ఫ్రమ్ హోమ్ సర్వేను చేపట్టింది. జిల్లాలో నిరుద్యోగులు ఎంత మంది ఉన్నారు. ఎంతవరకు చదువు కున్నారు ? ఎటువంటి ఉద్యోగానికి వెళ్ళాలి అనుకుంటున్నారు? తదితర వివరాలను సర్వే బృందం సేకరి స్తోంది. గ్రామ, వార్డు సచివాలయశాఖ సిబ్బంది సర్వేను వేగంగా నిర్వహిస్తున్నారు. ఈనెల 8వ తేదీ నాటికి సర్వే పూర్తిచేసి నివేదికను ప్రభుత్వానికి అందించేందుకు కార్యాచరణను రూపొం దించారు. నిరుద్యోగుల వివరాలు సేకరించేలా పని విభజన చేశారు. దూరప్రాంతాల్లో ఉన్న నిరుద్యోగులను సైతం వివరాలు, సంబంధిత కుటుంబ సభ్యుల నుంచి సేకరిస్తున్నారు. ఐటీ సెక్టార్లో ఉన్న వారి వివరాలను నమోదు చేస్తు న్నారు. ఇంటింటికి తిరిగి నిరుద్యోగుల విద్యార్హతను బట్టి ఎటువంటి ఉద్యోగం చేయాలనుకుంటున్నారో అడగడంతో పాటు శిక్షణ తీసుకుంటారా? అని అడి గి వివరాలు నమోదు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో నిరు ద్యోగుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. వర్క్‌ఫ్రమ్ హోమ్ సర్వేలో భాగంగా జిల్లాలో చదువుతున్న నిరుద్యోగులపై సర్వే చేస్తున్నారు. 18 నుంచి 50 ఏళ్ల లోపు వయస్సు ఉన్నవారి విద్యార్హత సమా చారంతో ఆయా సచివాలయాలకు జాబితాలు చేరుకున్నాయి. డిప్లమా, డిగ్రీ, ఇంజనీరింగ్‌తో పాటు ఉన్నత చదువులు పూర్తి చేసిన వారిలో గృహిణిలు ఉన్నారు. సచివాలయ సిబ్బంది, ఆయా అభ్యర్థుల వివరాలను నమోదు చేస్తున్నారు. వేలిముద్ర, ఐరిష్ తీసుకుంటున్నారు. సమగ్ర సర్వేలో భాగంగా వారి విద్యార్హ తను బట్టి వర్క్‌ఫ్రమ్ హోమ్‌కింద ఏ తరహా ఉద్యోగం కావాలని అడిగి తెలిసి నమోదు చేసుకుంటున్నారు. ప్రభుత్వం అందించే శిక్షణకు హాజరవుతారని అడిగి


సర్వే నిర్వహిస్తున్న సచివాలయ ఉద్యోగులు

వివరాలు సేకరిస్తుండడంతో నిరుద్యోగుల్లో ఆశలు మరింత చిగురిస్తున్నాయి. ఏదోఒక ఉద్యోగం వస్తుందన్న ఆశాభావం వారు వ్యక్తం చేస్తున్నారు. సచివాలయ సిబ్బంది వర్క్‌ఫ్రమ్ హోమ్ సర్వే నిర్వహిస్తున్నారు.

సర్వేలో భాగంగా..

విద్యార్హతలను బట్టి వారు ఏ శిక్షణ కోరుకుంటున్నారు? ఎటువంటి ఉద్యోగం కావాలనుకుంటున్నారో నమోదు చేసు కుంటున్నారు. ఐటీ సెక్టారా ? వర్క్‌ఫ్రమ్ హోమ్, ఇంటింటికి బ్రాడ్ బ్యాండ్ కనెక్టివిటీ ఉందా ? లేదా? ఇంట్లో ప్రత్యేక గది తదితర వివరాలు నమోదు చేస్తున్నారు. ఐటీ, ఐటీ ఎలక్ట్రికల్ సర్వీసెస్, ఇంజనీరింగ్ చదువు కున్న వారి నుంచి ప్రత్యేకంగా వివరాలను సేకరిస్తున్నారు.

టీటీడీకి ఎన్ఆర్ఐ రూ.కోటి విరాళం



కొవ్వూరు/ చాగల్లు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : తిరుమల తిరుపతి వేంక టేశ్వరస్వామిని కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంక టేశ్వరరావు దర్శించుకు న్నారు. చాగల్లు మండలం టీడీపీ అధ్యక్షుడు నాదెళ్ళ శ్రీరామ్ సన్నిహితుడు, దుబాయ్‌లో స్థిరప డిన ఎన్నారై వినీత్ దంపతులు స్వామివారికి కోటీ లక్ష రూపాయలు విరాళంగా అందజేశారు.ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావుతో కలిసి వినీత్, దివ్య దంపతులు టీటీడీ ఈవో వెంకయ్య చౌదరికి విరాళం చెక్కును గురువారం అందజేశారు.నాదెళ్ళ శ్రీరామ్, మద్దిపట్ల సురేష్, ఆశోక్, పరిటాల గోపాల్, తదితరులు ఉన్నారు.

పక్షుల దాహార్తి తీర్చుతున్న జాకీర్



టి.నరసాపురం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి):వేసవితాపం అందిరికీ ఒక్కటే.. పశుపక్షా ్యదులు కూడా దాహంతో అలమ టిస్తుంటాయి..వేసవి కాలం వచ్చేసింది.. ఎక్కడా నీటి చుక్క కనిపించదు.. ఈ నేపథ్యంలో టి.నరసాపురం మండలం బండివారిగూడెం గ్రామంలో ఉపయోగంలో లేని వస్తువులతో పలు ప్రదేశాల్లో నీరు నింపి పక్షుల దాహార్తి తీర్చుతున్నారు వన సంరక్షణ సమితి సభ్యుడు, రాణా వెల్ఫేర్ సొసైటీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు షేక్ జాకీర్‌హుస్సేన్.. పర్యావరణ పరిరక్షణతోనే మానవ మనుగడ సాధ్యమని ఆయన అన్నారు..

ఆత్మ..పరమాత్మ సంబంధమే సనాతన ధర్మం

ఇస్కాన్ అంతర్జాతీయ ప్రచారకుడు భక్త వికాసస్వామి



ఆత్మకు, పరమాత్మకు మధ్య ఉన్నదే సనాతన ధర్మం. కృష్ణతత్వం తెలుసుకోవాలంటే ఎన్నో జన్మలు పడుతుంది. మనిషి నడవడిక ఎలా ఉండాలో తెలియజేసేదే భగవద్గీత. భారత దేశంలో యువత ఎలా ఉండాలనేదానిపై భారత యువతకు సందేశం అనే పుస్తకాన్ని రచించాను. భగవన్నామస్మరణ మోక్ష మార్గానికి దారి వంటిదని ఇస్కాన్ అంతర్జాతీయ ప్రచారకుడు త్రిదిండి సన్యాసి భక్త వికాస స్వామి చెప్పారు. పాలకోడేరు మండలం గొల్లల కోడేరు ఇస్కాన్ మంది రంలో హరే కృష్ణ ఉత్సవానికి హాజరైన ఆయనను ఆంధ్రజ్యోతి పలకరించింది. పలు ఆధ్యాత్మిక విషయాలను వివరించారు.

• ధర్మబద్ధమైన జీవనంతో భగవంతుని అనుగ్రహం

కృష్ణ తత్వం తెలుసుకోవాలంటే ఎన్నో జన్మలు పడుతుంది. శ్రీ కృష్ణ పరమాత్మ అన్నింటిలో ఉంటాడు. సర్వాంతర్యామి. నేటి సమాజంలో మానవడు ఎలా ఉండాలి ? ఎలా జీవించాలి? అనేది తెలుసుకోవాలంటగే భగవద్గీత చదవాలి. జంతువుల్లా తినడం, పడుకోవడం, మైధునం చెయ్యడమేనా మనిషి ధర్మం.. మనం చెయ్యవలసిన ధర్మాలను పాటిస్తే భగవంతుని అనుగ్రహం కలుగుతుంది.

• యువత సన్మార్గంలో పయనించాలి

నేటి యువత చెడు వ్యసనాలకు దగ్గర అవుతున్నారు. దానినుంచి బయటప డాలి. వారు చదువుకున్న దానికి కావలసి ఉద్యోగాలు అందడం లేదు. ఉన్న దాంట్లో తృప్తి పడాలి. భగవన్నామ స్మరణ ఎంతో మనఃశాంతిని కలుగ చేస్తుంది. కలియుగంలో దయ, మంచితనం క్షీణిస్తాయి.జ్ఞాపకశక్తి తగ్గుతుంది. ఆయుఃప్రమాణాలు మారిపోతున్నాయి. అందుకే ప్రతీ ఒక్కరూ కృష్ణ సంకీర్తన చెయ్యడం శ్రేయస్కరం.

• భగవద్గీత ప్రతీ ఒక్కరూ చదవాలి

ఆత్మకు, పరమాత్మకు ఉన్న సంబంధమే సనాతన ధర్మం. దీనికి అంతమే లేదు. సమాజం కామ, క్రోధ మద,మాత్సర్యాలతో నిండి ఉంది. వాటిని త్యజించి చూస్తే ఆత్మజ్ఞానం కలుగుతుంది. భగవద్గీత చదివితే అందులోని సారం మనకు ఎంతో అనుభూతిని కలిగిస్తుంది. శ్రీకృష్ణుడు అర్జునుడికి బోధన చేస్తుంటే అర్జునుడు అడిగే ప్రశ్నలకు పరమాత్మ సమాధానాలు మన నిత్య జీవన విధానాలకు దగ్గరగా ఉంటాయి. అందుకే భగవద్గీత మానవ జీవన మనుగడకు మార్గదర్శకం..

- భీమవరం టౌన్ (ఆంధ్రజ్యోతి)



ఏలూరు కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న కోకో రైతులు

కదంతొక్కిన కోకో రైతులు

గింజల కొనుగోలు సమస్యపై ఏలూరు కలెక్టరేట్ వద్ద ధర్నా

ఏలూరు రూరల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): కోకో గింజలు కొనుగోలు సమస్య పరిష్కారం కోరుతూ ఏలూరులో రైతులు కదం తొక్కారు. కోకో గింజలు, కోకో కాయలతో నిరసన తెలిపారు. అంతర్జాతీయ మార్కెట్ ప్రకారం కోకో గింజలకు కిలో రూ.900 ధర ఇచ్చి విదేశీ గింజల దిగుమతులు ఆపాలంటూ నినాదాలు చేశారు. తొలుత కలెక్టరేట్ నుంచి ఫైర్‌స్టేషన్ మీదుగా ఉద్యానశాఖ డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయం వద్దకు చేరుకుని నిరసన తెలిపి కలెక్టరేట్ వద్ద ధర్నా కొనసాగించారు. కలెక్టర్‌కు వినతిపత్రం అందచేశారు. ఏపీ రైతు సంఘం కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ కోకో గింజలు కొనుగోలు కంపెనీలు సిండికేట్‌గా మారి రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నా ప్రభుత్వం, అధికారులు పట్టించుకోకపోవడం అన్యాయం అన్నారు. అంతర్జాతీయ మార్కెట్ ప్రకారం కిలోకు రూ.900 ధర కల్పించి కొనుగోలుకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. విదేశీ దిగుమతులు తక్షణమే నిలుపుదల చేసి రైతుల వద్దనున్న గింజలు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కోకో రైతుల సంఘం నాయకులు డి.రామకృష్ణ, ఎస్.గోపాలకృష్ణ, జె.కాశీబాబు, గోపాల్‌రావు, అచ్యుత రామయ్య, కట్టా సుబ్బారావు, సుబ్బారెడ్డి తదితరులు మాట్లాడుతూ గత ఏడాది ఖోఖో గింజలకు రూ.వెయ్యి ధర వచ్చిందన్నారు. ప్రస్తుత మార్కెట్లో రూ.900లకు ధర ఉన్నా ఖోఖో గింజలు కొనుగోలు కంపెనీలు ధర చెల్లించడం లేదన్నారు. తక్షణం సమస్యపై ప్రభుత్వం జోక్యం చేసుకుని న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోకో, కొబ్బరి రైతుల సంఘం నాయకులు జి.రమేష్‌రెడ్డి, కె.సతీష్, సుబ్బారావు, పెద్ద సంఖ్యలో కోకో రైతులు తరలివచ్చారు.

రైతు సమస్యలపై స్పందించిన కలెక్టర్

కోకో రైతు సమస్యలపై కలెక్టర్ కె.వెట్రిసెల్వి సానుకూలంగా స్పందించారు. రైతు సంఘం నాయకులు, కార్యకర్తలు కలెక్టర్‌ను గురువారం కలిసి సమస్యలను విన్నవించారు. ఎరువుల ధరలు, కూలి ఖర్చులు పెరిగాయని, కోకో గింజలు కొనుగోలు సమస్యపై ప్రభుత్వం, అధికారులు వెంటనే జోక్యం చేసుకోవాలని కోరారు. ఉద్యానశాఖ కమిషనర్, ప్రభుత్వ దృష్టికి సమస్యలు తీసుకెళ్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు. కోకో గింజల కొనుగోలు కంపెనీలతో సమావేశాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. కలెక్టర్‌కు కె.శ్రీనివాస్, బొల్లు రామకృష్ణ, ఎస్.గోపాలకృష్ణ, జె.కాశీబాబు, ఎల్.గోపాలరావు వినతిపత్రం అందజేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ శ్రీనివాస్

భవన నిర్మాణాల ప్లాన్ అప్రూవల్‌కు

మునిసిపాలిటీ అనుమతి అక్కర్లేదు

ఏలూరుటూటౌన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణాల ప్లాన్ అప్రూవల్‌కు మునిసిపల్, కార్పొరేషన్ అనుమతులు అవసరం లేదని, లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్స్ (ఎల్‌టీపీ)కు ప్లాన్ అప్రూవల్ అధికారం ప్రభుత్వం ఇచ్చిందని టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ ఎం.సాంబశివరావు అన్నారు. భవన నిర్మాణాల ప్లాన్‌ల అప్రూవల్ అంశాలపై ఏలూరు టౌన్ ప్లానింగ్ అసిస్టెంట్ సిటీప్లానర్ శ్రీనివాస్ అధ్యక్షతన కలెక్టరేట్‌లో గురువారం అవగాహన సదస్సు జరిగింది. సాంబశివరావు, శ్రీనివాసులు మాట్లాడుతూ ఎల్‌టీపీల ద్వారా మునిసిపల్ నిబంధనల ప్రకారం ప్లాన్ వేయించుకుని వారితోనే అప్రూవల్ చేయించుకుని నిర్మాణదారులు ఎటువంటి డివియేషన్‌లేకుండా ప్లాన్ ప్రకారమే నిర్మించుకోవాలన్నారు. ప్లాన్ ప్రకారం నిర్మించుకోకపోతే ఇంటి యాజమానులతో సహా ఎల్‌టీపీలే బాధ్యత వహించాల్సి వస్తుందన్నారు.

ప్లానింగ్ అధికారులు ఎ.సత్యమూర్తి, సుధాకర్, సురేఖ, ఏసీపీ ఎం.సాయికృష్ణ, డీపీవో సాంబశివరావు, తదితరులు సూచలు ఇచ్చారు.

కార్యక్రమంలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాల 9మునిసిపాల్టీలు, ఏలూరు నగర పాలక సంస్థకు సంబంధించిన టౌన్‌ప్లానింగ్ ఆఫీసర్లు, ఇన్‌స్పెక్టర్లు, వార్డు ప్లానర్స్, సచివాలయ సెక్రటరీలు, ఎల్‌టీపీలు పాల్గొన్నారు.

రేపు జాతీయ లోక్ అదాలత్


ఏలూరు క్రైం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లాలో ఈనెల 8న జాతీయ లోక్ అదాలత్ జరగనుందని, అధిక సంఖ్యలో కేసుల పరిష్కారానికి ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి (ఎఫ్ఏసీ) ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎం సునీల్‌కుమార్ చెప్పారు. జిల్లా కోర్టులో జాతీయ లోక్ అదాలత్ ఏర్పాటుపై గురువారం విలేకరుల సమావేశంలో సునీల్‌కుమార్ మాట్లాడుతూ జాతీయ లోక్ అదాలత్‌కు జిల్లా కోర్టులో 6 బెంచ్‌లు ఏర్పాటు చేశామన్నారు. అన్ని కోర్టులలో 26 లోక్‌అదాలత్ బెంచ్‌లు ఏర్పాటుచేసి కేసుల పరిష్కారానికి చర్యలు తీసుకున్నామన్నారు. 2500 కేసుల పరిష్కారం లక్ష్యంగా నిర్ణయించామన్నారు. వివిధ కారణాలతో కోర్టుకు రాలేని వారి కోసం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కక్షిదారుల నుంచి వివరాలు తీసుకుని, రాజీకి సిద్ధపడితే కేసుల పరిష్కారం చేస్తామన్నారు. కేసుల పరిష్కారంపై ప్రజలకు అవగాహన నిమిత్తం కక్షిదారులు, పోలీస్, రెవెన్యూ, ఎంపసీటీ కౌన్సిల్స్, బీమా కంపెనీల ప్రతినిధులు, న్యాయవాదులు, బ్యాంకర్స్, బీఎస్ఎన్ఎల్ చిట్ ఫండ్ కంపెనీల ప్రతినిధులు, కార్మికశాఖ, మునిసిపల్ అధికారులతో 69 సమావేశాలు నిర్వహించామన్నారు.

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్ మాట్లాడుతూ రాజీ మార్గం రాజమార్గమని, రాజీ కాదగిన కేసులను లోక్‌అదాలత్ ద్వారా పరిష్కారం చేసుకుని సమయాన్ని, డబ్బును ఆదా చేసుకోవాలన్నారు. జిల్లా కోర్టు ఆవరణలోని జిల్లా న్యాయ సేవా సదన్‌లో శాశ్వత లోక్ అదాలత్ ఏర్పాటు చేశామన్నారు. ఏలూరు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కోనే సీతారాం మాట్లాడుతూ కక్షిదారులు కేసుల సత్వర పరిష్కారానికి లోక్ అదాలత్‌లను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బాలుడి అనుమానాస్పద మృతి

పోలీసులు తీసుకెళ్లారని బంధువుల ఆందోళన

తర్వాత ఎవరూ కారణం కాదని వాంగ్మూలం



యశ్వంత్‌కుమార్ మృతదేహం, పక్కన ఫైల్ ఫొటో

ఏలూరు క్రైం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): పద్నాలుగేళ్ల బాలుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పోలీసులు, మృతుని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం చింతలపూడి ప్రభుత్వ హైస్కూలులో అటెండర్‌గా పనిచేస్తున్న బంగారు శివకు భార్య అనిత, ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు కృష్ణ వర్ధన్ ఐటీఐ చదువుతున్నాడు. రెండో కుమారుడు అయిన బంగారు యశ్వంత్‌కుమార్ (14) ఏడవ తరగతి చదివి ఖాళీగా ఏలూరు చేపల తూము సెంటర్‌లో నానమ్మ వద్ద ఉంటున్నాడు. ఈనెల 5న సాయంత్రం తనకు అనారోగ్యంగా ఉందని యశ్వంత్‌కుమార్ సోదరుడు కృష్ణవర్ధన్‌తో చెప్పి బయటకు వెళ్లాడు. అర్ధరాత్రి సమయంలో పెదవేగి మండలం మొండూరు సమీపంలోని పోలవరం కాలువ గట్టు వద్ద అపస్మారక స్థితిలో పడి ఉండగా అటుగా వెళుతున్న వారు అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చి ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అత్యవసర విభాగపు వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించి మృతదేహాన్ని ఆసుపత్రి మార్చురీకి తరలించారు. యశ్వంత్‌కుమార్ మృతదేహం మార్చురీలో ఉందన్న సమాచారం తెలిసిన కుటుంబ సభ్యులు గురువారం ఉదయం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి చేరుకుని మృతదేహాన్ని గుర్తించారు. సీసీఎస్ పోలీసులు మోటారు సైకిల్ దొంగతనాల కేసులో యశ్వంత్‌కుమార్‌ను తీసుకువెళ్లారని వారే ఏదో చేసి ఉంటారని తల్లిదండ్రులు, బంధువులు ఆరోపించి ఆసుపత్రి వద్ద ఆందోళన చేశారు. తమకు న్యాయం చేయాలని కోరారు.

అతని సోదరుడు కృష్ణవర్ధన్ మాత్రం తన తమ్ముడు యశ్వంత్‌కుమార్ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడని పెదవేగి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అనంతరం బాలుడి మృతిపై ఎలాంటి అనుమానం లేదని కుటుంబ సభ్యులు, బంధువులు రాతపూర్వకంగా పోలీసులకు తెలిపారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

కోడ్ ముగిసింది



అధికారుల నిర్ణయాలు, ఆచరణ ఇక వేగవంతం

- తాగునీరు, విద్యుత్, ఉపాధి పనులపై సమీక్షలు
- ప్రజాప్రతినిధులు, అధికారులకు ఒకింత స్వేచ్ఛ
- అభివృద్ధి పనుల టెండర్లకు ఆస్కారం
- అందుబాటులోకి ప్రజా పరిష్కార వేదికలు

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలతో నెల రోజులుగా ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో ప్రభుత్వ పథకాలు, నూతనంగా చేపట్టాల్సిన పనులు, సమీక్షలు, గ్రీవెన్ తదితర కార్యక్రమాలు నిలిచిపోయాయి. ప్రజాప్రతినిధులు నోరుతెరిచి అధికారులకు ఆదేశాలు ఇవ్వలేని పరిస్థితులు. ప్రజలకు బహిరంగంగా హామీలు కూడా ఇవ్వలేని నిస్సహాయత. అధికారులది ఇంకో పాత్ర. తమ పరిధిలో ఇంతకుముందున్న పథకాల అమలుకు ఆదేశాలు. కొత్త నిర్ణయాలు తీసుకోవడం మచ్చుకైనా లేదు.. ఎన్నికలు ముగిశాయి.. విజేతలను ప్రకటించారు. ఖాళీ బ్యాలెట్ బాక్స్‌లు గోదాములకు చేరాయి. లెక్కించిన బ్యాలెట్ పత్రాలు ఖజానాలో భద్రపరిచారు. రెండు రోజుల క్రితమే ఎన్నికల కోడ్ ముగిసింది. ఇక ప్రజాప్రతినిధులు, అధికారులకు నిర్ణయాలు, సమీక్షలకు అనుకూలత ఏర్పడింది.

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కారణంగా నెల రోజులకుపైగా ఎక్కడి పనులు అక్కడే. పాత నిర్ణయాలు అమలుకాలేదు, కొత్త నిర్ణయాలకు ఆస్కారమేలేదు. కొన్ని పనులకు సంబంధించి టెండర్ల ప్రక్రియను పూర్తి చేయలేకపోయారు. మరికొన్నింటికి టెండర్లు వేసేందుకు ఆస్కారమే లేకుండా పోయింది. ప్రతీవారం అధికారులు నిర్వహించే ప్రజా పరిష్కార వేదికలు గడిచిన ఆరు వారాలుగా అదృశ్యమయ్యాయి. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉండడమే దీనికి ప్రధాన కారణం. సాధారణంగా జనవరి నాటికే తాగునీరు, విద్యుత్ సరఫరా, ఆధునీకీకరణ పనులకు సంబంధించి టెండర్ల ఖరారు, సాగునీటికి సంబంధించి కీలక నిర్ణయాలతోపాటు ఉపాధి పనులకు ప్రాధాన్యత ఇస్తారు. కాని ఎన్నికల కోడ్ అమలులో ఉన్న కారణంగా అధికారులు ఎక్కడికక్కడ కీలక నిర్ణయాలు తీసుకోలేకపోయారు. తాగునీటి ఎద్దడి ఏర్పడే ప్రాంతాలను ముందుగా గుర్తించి ఆయా ప్రాంతాల్లో వేసవిలో గట్టెక్కే నిమిత్తం ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తారు. ఈ తరుణంలో స్థానిక ఎమ్మెల్యేలతోపాటు మంత్రులు, స్థానిక ప్రజాప్రతినిధులు అభిప్రాయాలకు అనుగుణంగా సమీక్షలు, వాటిలో నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంది.

తాగునీటి ఎద్దడి నివారణ చర్యలు

వేసవిలో నీటి ఎద్దడి నివారణకు కార్యాచరణ రూపొందించారు. క్షేత్రస్థాయి చర్యలకు ఎన్నికల కోడ్ ఆటంకంగా మారింది. ఉమ్మడి జిల్లా, మెట్ట ప్రాంతంలోని జలాశయాలు, చెరువుల్లో వేసవి ఆరంభానికి ముందే నీటిమట్టం క్రమేపీ తగ్గుతోంది. ఒకవైపు మండుటెండలు, వడగాడ్పులు ఆరంభమై నీటి వినియోగాన్ని మరింత పెరిగేలా చేశాయి. ఈ క్రమంలోనే ముందస్తు చర్యలన్నీ సక్రమంగా అమలైతే రాబోయే మూడు నెలల్లోనే నీటి ఎద్దడి అధిగమించే అవకాశం ఉండేది. ప్రజాప్రతినిధుల చొరవ, మంత్రుల జోక్యం, స్థానిక నేతల చొరవతో అన్ని గ్రామాలకు తాగునీటి ఎద్దడి లేకుండా కనీస జాగ్రత్తలు పాటించేవారు. కృష్ణ కాలువ నుంచి సక్రమంగా నీరు వస్తేనే ఏలూరులో మూడొంతులు భాగానికి తాగునీరు అందడానికి ఆస్కారం. ఇప్పటిదాకా దీనిపై కీలక సమీక్ష ఏదీ జరగలేదు. గోదావరి కాలువ నుంచి నీటిని రిజర్వాయర్లలోకి నింపాల్సి ఉంది. అదికూడా సాధ్యం కాలేదు. దీనిపై నేరుగా ఇన్‌చార్జి మంత్రి సమీక్షకు దిగి అధికారులకు మార్గనిర్దేశం చేయాల్సి ఉన్నా ఎన్నికల కోడ్ అడ్డంకిగా మారింది. కోడ్ ముగియడంతో మంత్రులు, ఎమ్మెల్యేలతోపాటు అధికారులు చొరవ తీసుకుని నీటి ఎద్దడి నివారణ చర్యలకు ఆస్కారం ఏర్పడింది.

సాగు నీటికి ఇప్పటికే ఆటంకాలు

జిల్లా వ్యాప్తంగా సాగునీటి వనరులు స్వల్పంగానే ఉండడం, వాటి వినియోగంలో ప్రతీ ఏటా ఇబ్బందులు ఎదురవడం పెరుగుతూ వచ్చింది. గోదావరి, కృష్ణ కాలువలకు కొన్ని మరమ్మతులు చేపట్టాల్సి ఉంది. తూడు తొలగించి సరఫరాకు ఆటంకాలను తప్పించాలి. ఇటువంటి పరిస్థితులన్నీ అధికారికంగా సమీక్షిస్తేనే తప్ప సాధ్యంకాదు. కృష్ణ కాలువ నుంచి వచ్చే నీరంతా పంపుల చెరువుకు చేరడం, అక్కడి నుంచి ఏలూరువాసుల తాగునీటి అవసరాలకు కాస్తోకూస్తో సరిపోయేటట్టుగా ఉండేది. సమాంతరంగా సాగు అవసరాలను తీర్చి రెండో పంటకు గట్టెక్కించేలా మారేది. కాని ఈసారి ఇప్పటిదాకా గోదావరి, కృష్ణకాలువలు రెండింటికీ మెయింటినెన్స్ పూర్తికాలేదు. ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుంటేనే తప్ప అధికారులు ముందుకు సాగడం ఎప్పటికీ కష్టమే. ఈసారి ఎన్నికల కోడ్ కాస్తా కీలక సమయంలో వచ్చిపడడంతో అనేక ఆటంకాలు ఇప్పటికీ పొంచే ఉన్నాయి. కాలువల ఆధునికీకరణకు సంబంధించి టెండర్ల ప్రక్రియను పూర్తి చేసి కాలువలను మరో 20 రోజుల్లో కట్టేసిన వెంటనే ఆధునికీకరణ పనులు చేపట్టాల్సి ఉంది. దీనికి సంబంధించిన టెండర్ల ప్రక్రియ ఎన్నికల కోడ్ కారణంగా నిలిచింది. ప్రస్తుతం కోడ్ ముగిసినా ఇప్పుడు ఈ ప్రక్రియ అంతా పూర్తికావడానికి కొంత సమయం పట్టవచ్చని భావిస్తున్నారు. గోదావరిలో నీటి నిల్వలు సంతృప్తికర స్థాయిలో లేకపోవడంతో సీలేరు నుంచి అదనపు జలాలు విడుదల కావాల్సి ఉంది.

ఉపాధి పనుల నుంచి మరెన్నో..

ఈ వేసవి సీజన్ ఆరంభంలోనే ఉపాధి పనులు చేపట్టి ప్రత్యేక్య కార్యాచరణ ద్వారా వేలాది మందికి పనులు కల్పించడం ద్వారా ఉపాధి అందించాల్సి ఉంది. కాని ఇప్పుడు ఆ పరిస్థితికి చాలా సమయం తీసుకున్నారు. ఎన్నికల వాతావరణం అన్ని చోట్ల ఉండడంతో ప్రాధాన్యత కలిగిన ఈ వ్యవహారాన్ని ముందస్తుగా సమీక్షించడానికి అడ్డంకులు ఏర్పడ్డాయి. ఈ పరిస్థితులన్నింటినీ ఇప్పుడు అధిగమించి ఒక్క ఉపాధే కాకుండా జల జీవన్‌మిషన్, వేసవిలో ఏర్పడే ఎద్దడి నివారణ, వైద్య ఆరోగ్యశాఖ, విద్యాశాఖ వంటి అనేక విభాగాలపై ప్రత్యేక సమీక్షలు కొనసాగితే ఒక స్థూల నిర్ణయానికి రావడానికి అవకాశం ఏర్పడుతుంది.

చేపలు పట్టడానికి వెళ్లి..

క్రైమ్ కార్నర్

అన్నదమ్ములు దుర్మరణం



చెరువులో మునిగిన యువకుల ఆచూకీ కోసం గాలిస్తున్న స్థానికులు
లభ్యమైన చంద్రశేఖర్, విజయకుమార్ మృతదేహాలు

- చెరువులో మునిగిన తమ్ముడు
- రక్షించబోయిన అన్న కూడా మృతి
- తుమ్మగూడెంలో విషాదం

చాట్రాయి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తుమ్మగూడెంలో గురువారం చేపలు పట్టడానికి వెళ్లిన ఇద్దరు అన్నదమ్ములు మొలుగుమాటి చంద్రశేఖర్(30), విజయకుమార్(27) నీటిలో మునిగి మృతి చెందారు. వ్యవసాయ పనులకు వెళ్లివచ్చిన అన్నదములు మధ్యాహ్నం నుంచి జయపురం చెరువులో చేపలు పట్టడానికి వెళ్లారు. చేపలు పడుతుండగా విజయకుమార్ నీటిలో మునిగి పోతుండడంతో తమ్ముడిని రక్షించడానికి చంద్రశేఖర్ నీటిలో దూకాడు. ఇద్దరు మునిగిపోతుండటంతో అక్కడే చేపలు పడుతున్న కొంతమంది రక్షించే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. సమాచారం అందుకున్న ఎస్ఐ రామకృష్ణ సిబ్బందితో కలిసి సంఘటనాస్థలానికి వెళ్లి మృతిదేహాలను వెలికితీయించి పోస్టుమార్టం నిమిత్తం తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు. అన్నదమ్ములు మృతి చెందటంతో తుమ్మగూడెం శివారు బిల్లింగ్‌గూడెంలో విషాదం నెలకుంది. అన్నదమ్ముల మృతదేహాలపై తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల రోదిస్తున్న తీరు చూపరులను కంటతడి పెట్టించింది. మృతులు చంద్రశేఖర్‌కు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె, విజయకుమార్‌కు భార్య కుమారుడు కుమార్తె ఉన్నారు. సర్పంచ్ మారెమ్మ, స్థానిక నాయకులు మందలపు రాజారావు, మాదల నరసింహారావు మృతుల కుటుంబాన్ని పరామర్శించి సానుభూతి తెలిపారు.



విరిగిన వేంద్ర రైల్వే గేట్

వేంద్ర రైల్వే గేటును ఢీకొట్టిన స్కూల్ బస్సు

పాలకోడేరు, మార్చి 6(ఆంధ్రజ్యోతి): వేంద్ర రైల్వే గేటును గురువారం సాయంత్రం ఒక స్కూల్ బస్సు ఢీకొట్టడంతో రైల్వే గేటు విరిగిపోయింది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి గాయాలు కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. ప్రైవేట్ స్కూల్ బస్సు రైల్వే గేటును ఢీకొట్టడంతో గేటు సగభాగం ట్రాక్‌పై పడింది. అదే సమయంలో కాకినాడ వైపు నుంచి భీమవరం వస్తున్న సర్కార్ ఎక్స్‌ప్రెస్ మరో ట్రాక్ నుంచి వెళ్లిపోవడంతో ఎటువంటి ప్రమాదం జరగలేదని స్థానికులు తెలిపారు. స్థానికులు రైల్వే గేటుకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టడంతో స్కూల్ బస్సు కూడా వేంద్ర వైపు పిల్లలను దింపేందుకు వెళ్లిపోయింది. దీనిపై రైల్వే అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.

మోటార్ సైకిల్‌ను ఢీకొన్న స్కూల్ బస్

ఇద్దరికి గాయాలు

జీలుగుమిల్లి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): లక్ష్మీపురం వద్ద జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనాన్ని ప్రైవేట్ స్కూల్ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. జంగారెడ్డిగూడెంకు చెందిన ప్రైవేటు పాఠశాల బస్సు గురువారం మోటార్ సైకిల్‌ను ఢీకొన్న ప్రమాదంలో ఐఎస్.జగన్నాధపురం నుంచి కూలి పనులకు వెళుతున్న గౌతు సత్యనారాయణ, మనెల్లి ముక్కయ్య తీవ్ర గాయాలపాలయ్యారు. వారిని 108 వాహనంలో జంగారెడ్డిగూడెం ఆస్పత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని పరిశీలించి పోలీసులు వివరాలు సేకరించారు.

తాడేపల్లిగూడెంలో ఏటీఎం చోరీకి విఫలయత్నం

తాడేపల్లిగూడెం రూరల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఏలూరు రోడ్డులో ఏటీఎం చోరికి దుండగులు బుధవారం రాత్రి విఫలయత్నం చేశారు. సీసీ కెమేరాలు ధ్వంసం చేసి గునపంతో ఏటీఎం పగలకొట్టేందుకు ప్రయత్నం చేశారు. ఏటీఎం లాకర్ తెరుచుకోకపోవడంతో గునపం అక్కడే వదిలేసి దుండగులు పరారయ్యారు. బ్యాంకు అధికారుల ఫిర్యాదుతో పట్టణ సీఐ సుబ్రహ్మణ్యం సంఘటనాస్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. అనంతరం డాగ్ స్క్వాడ్‌తో గాలింపు చర్యలు చేపట్టారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ సుబ్రహ్మణ్యం తెలిపారు.

కల్వర్టు పైనుంచి పడి ఒకరి మృతి

లింగపాలెం, మార్చి 6(ఆంధ్రజ్యోతి): ప్రమాధవశాత్తు కల్వర్టు పైనుంచి పడి వ్యక్తి మృతి చెందిన ఘటన లింగపాలెం మండలంలో చోటుచేసుకుంది. ధర్మాజీగూడెం ఎస్ఐ కే వెంకన్న తెలిపిన వివరాల ప్రకారం కె.గోకవరం గ్రామానికి చెందిన మరిడి వెంకటేశు(50) ఈ నెల 3న పొగాకు కోత పనికి వెళ్లాడు. నీరసంగా ఉందని రోడ్డు పక్కనే ఉన్న కల్వర్టు పై కూర్చున్నాడు. అదే సమయంలో కళ్లు తిరిగి కాలువలో పడిపోయాడు. గాయపడిన అతడిని కుమారుడు ఏలూరు ఆసుపత్రికి తీసుకు వెళ్లాడు. అక్కడి నుంచి విజయవాడ తీసుకువెళ్లగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు తెలిపారు. మృతుని కుమారుడు నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కె.వెంకన్న తెలిపారు.

వివాహమైన నెల రోజులకే..

విద్యుదాఘాతంతో షిఫ్ట్ ఆపరేటర్ మృతి



ట్రాన్స్‌ఫార్మర్‌పై వేలాడుతున్న మృతదేహం (ఇన్‌సెట్) గండిబోయిన రాజు(ఫైల్)

కామవరపుకోట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): పామాయిల్ తోటలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌పై పనులు నిర్వహిస్తున్న షిఫ్ట్ ఆపరేటర్ విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. తడికలపూడి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కళ్ళచెరువు పంచాయతీ పాతగండిగూడెం గ్రామానికి చెందిన గండిబోయిన రాజు (29) విద్యుత్ సబ్ స్టేషన్‌లో షిఫ్ట్ ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. గురువారం ఉదయం ఉన్నతాధికారులకు తెలియచేసి విద్యుత్ సరఫరా నిలిపి పనులు చేస్తున్నాడు. అదే సమయంలో ఆకస్మికంగా విద్యుత్ సరఫరా కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. తడికలపూడి పోలీసులు, విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

రాజుకు అదే గ్రామానికి చెందిన స్వాతితో గత నెల 1న వివాహమైంది. ఈ సంఘటనతో ఆ కుటుంబంలో విషాదం నెలకొంది. వివాహమైన నెల రోజులకే యువకుడు మృత్యువాత పడడం దురదృష్టకరమని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సంఘటనపై కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఎ.ఫ్రాన్సిస్ మాట్లాడుతూ విద్యుత్ శాఖ ఉన్నతాధికారుల నిర్లక్ష్యం కారణంగా షిఫ్ట్ ఆపరేటర్ దుర్మరణం చెందాడని, ఆ కుటుంబానికి రూ.20 లక్షల నష్టపరిహారం అందజేయాలని, ఆ కుటుంబంలోని వారికి ఉద్యోగావకాశం కల్పించాలని డిమాండ్ చేశారు.

ఇంటి పని చేస్తుండగా..

భీమవరం క్రైం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఇంటి పని చేస్తుండగా ఒక తాపీ వర్కర్ విద్యుదాఘాతంతో మృతి చెందిన సంఘటన పట్టణంలో చోటు చేసుకుంది. టూటౌన్ ఎస్ఐ రెహ్మాన్ తెలిపిన వివరాల ప్రకారం భీమవరం మండలం రాయలం గ్రామానికి చెందిన మహంతి గోవిందరావు (37) గొల్లవానితిప్ప రోడ్డులో తాపీ పని నిమిత్తం బుధవారం వెళ్లాడు. అక్కడ డ్రెయినేజీపై రాళ్లు పరుస్తూ ఉండగా అతనికి కరెంట్ తీగ తగిలి షాక్‌కు గురయ్యాడు. వెంటనే అంబులెన్స్‌లో భీమవరం ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు గోవిందరావు మృతి చెందినట్లుగా నిర్ధారించారు. గోవిందరావు భార్య ఇందువదన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రెహ్మాన్ తెలిపారు.



ప్రత్తిపాడు 3ఎఫ్ ఇండస్ట్రీస్‌లో

ఐటీ సోదాలు

పెంటపాడు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు 3ఎఫ్ ఇండస్ట్రీస్ కర్మాగారంలో గురువారం ఐటీ సోదాలు జరిగాయి. విజయవాడ నుంచి ప్రత్యేకంగా వచ్చిన బృందం సోదాలు నిర్వహించింది. మధ్యాహ్నం ప్రారంభమైన సోదాలు రాత్రి వరకు కొనసాగుతునే ఉన్నాయి. బయటి నుంచి ఎవరినీ లోపలికి అనుమతించలేదు. సోదాలు కొనసాగిన సమయంలో ఎవరూ లోపలికి వెళ్లకుండా గేట్లు మూసివేయించారు. సోదాలపై పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.

లారీ ఢీకొని ఒకరి మృతి



సంఘటనా స్థలిని పరిశీలిస్తున్న ఎస్ఐ నాగరాజు (ఇన్‌సెట్) మరియదాసు మృతదేహం

ఆకివీడు రూరల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): దుంపగడపలోని శ్రీచైతన్య స్కూల్ సమీపంలో జాతీయ రహదారిపై గురువారం జరిగిన ప్రమాదంలో మద్దా మరియదాసు (38) అక్కడికక్కడే మృతి చెందాడు. ఆకివీడు ఎస్ఐ నాగరాజు తెలిపిన వివరాలు మేరకు ఏలూరు జిల్లా కైకలూరు మండలం పెదకొట్టాడకు చెందిన మద్దా మరియదాసు (38) ఫిష్ ప్యాకింగ్ పనులు చేస్తుంటాడు. అతడికి భార్య ముగ్గురు కుమారులున్నారు. గురువారం తన తోడల్లుడు కుమారుడు దిన కార్యక్రమానికి అత్తిలి మండలం కొమ్మర గ్రామానికి మోటార్ సైకిల్‌పై వెళ్లాడు. తిరిగి ఇంటికి వెళుతుండగా కైకలూరు నుంచి ఆకివీడు వైపు వస్తున్న లారీ ఢీ కొంది. ఈ ప్రమాదంలో మరియదాసు అక్కడికక్కడే మృతి చెందాడు. అతడి భార్య ఉపాధి నిమిత్తం గల్ఫ్ వెళ్లింది. ఎస్ఐ నాగరాజు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ఢీకొని ఒకరు..

ఏలూరు క్రైం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): రైలు పట్టాలు దాటుతున్న వ్యక్తిని రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. టి.నరసాపురం మండలం కొల్లివారిగూడెనకు చెందిన నందమూరి గంగాధరరావు (44) బుధవారం రాత్రి ఏలూరు కొత్త బస్టాండ్ వెనుక రైలు పట్టాలు దాటుతున్నాడు. అదే సమయంలో రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఏలూరు రైల్వే ఎస్ఐ పి.సైమన్‌కు సమాచారం అందడంతో తన సిబ్బందితో సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

ట్రస్టు ఆసుపత్రికి స్పెషలిస్టుల రాక

పెంటపాడు, మార్చి 6(ఆంధ్రజ్యోతి): అలంపురం ట్రస్టు ఆసుపత్రికి ఈ నెల 7న హైదరాబాద్ నుంచి షుగర్ స్పెషలిస్టు డాక్టర్ రాజశేఖర్ వస్తున్నట్లు ట్రస్టు ఛైర్మన్ పెదకృష్ణంరాజు తెలిపారు. పాదాలలో తిమ్మిర్లు, స్పర్శ తగ్గడం, మానని పుండ్లు తదితర సమస్యలకు ఉచిత చికిత్సతో పాటు అవసరమైన వారికి ఆసుపత్రి వద్దే శస్త్రచికిత్సలు చేస్తారన్నారు. అలాగే ఈ నెల 9న ప్రముఖ న్యూరోసర్జన్ డాక్టర్ తీగల రమేష్ వస్తున్నారని తల, మెదడు, వెన్నెముక సమస్యలకు ఉచితంగా చికిత్స అందిస్తారన్నారు.

రేపు పెదతాడేపల్లిలో జాబ్‌మేళా

తాడేపల్లిగూడెం అర్బన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): పెదతాడేపల్లి లోటస్ స్కూల్‌లో ఈ నెల 9న ఉదయం 9 గంటల నుంచి మెగా జాబ్ మేళా జరుగుతుందని ఎమ్మెల్యే బొలిశెట్టి తనయుడు రాజేష్ తెలిపారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్ అభ్యర్థులు అర్హులన్నారు. పట్టణంలోని బస్టాండ్ నుంచి లోటస్ స్కూల్ వరకూ నాలుగు బస్సులు ఏర్పాటు చేశామని, అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటూ జిరాక్స్ లను కూడా తెచ్చుకోవాలన్నారు. జాబ్ మేళ బ్రోచర్లను ఆవిష్కరించారు.

ఇంటర్ పరీక్ష ప్రశాంతం

భీమవరం రూరల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ ప్రథమ సంవత్సర మేథ్స్, బోటనీ, సివిక్స్ పరీక్షలు గురువారం ప్రశాంతంగా జరిగాయి. 52 పరీక్షా కేంద్రాల్లో పరీక్ష నిర్వహించారు. జనరల్‌లో 18,997 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 18,279 మంది హాజరయ్యారు. 718 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఒకేషనల్‌లో 2176 విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 1942 మంది హాజరయ్యారు. 234 మంది గైర్హాజరయ్యారు. ఎటువంటి మాస్ కాపీయింగ్ జరగలేదని డీవైఈవో నాగేశ్వరరావు తెలిపారు.

జగన్ వ్యాఖ్యలపై కొత్తపల్లి ఫైర్

మొగల్తూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌పై మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహనరెడ్డి వ్యాఖ్యలపై రాష్ట్ర కాపు కార్పొరేషన్ ఛైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పవన్ కార్పొరేట్‌కు ఎక్కువ ఎమ్మెల్యేకు తక్కువ అంటూ ఇటీవల జగన్ మోహనరెడ్డి చేసిన వ్యాఖ్యలను ఖండించిన కొత్తపల్లి 11 సీట్లకే రాష్ట్ర ప్రజలు పరిమితం చేశారన్న విషయాన్ని జగన్ మర్చిపోకూడదన్నారు. ఈ నెల 14న పిఠాపురంలో జనసేన ఆవిర్భావ సభను పూర్తిస్థాయిలో విజయవంతం చేయాలని కోరారు. నీటి సంఘ ఉపాధ్యక్షుడు ముక్కు పుల్లయ్య నాయుడు, మాజీ సర్పంచ్ వీరాస్వామి, పులపర్తి శ్రీను, బుజ్జి, వీరాస్వామి, బర్రి రామస్వామి, స్వామి తదితరులు పాల్గొన్నారు.

రేపు మహిళలకు పలు పోటీలు

పాలకొల్లు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): పాలకొల్లు ఫెమినా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఈనెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహిస్తున్నామని క్లబ్ ప్రెసిడెంట్ యం.ఉమ, సెక్రటరీ ఐ.లలిత గురువారం విలేకర్లకు తెలిపారు. స్థానిక బస్టాండ్ రోడ్డులో ఉన్న లయన్స్ క్లబ్‌లో మహిళలను ప్రోత్సహిస్తూ వివిధ పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. ఇంటి వద్ద చిరుధాన్యాలతో చేసిన వివిధ రకాల వంటకాల పోటీలు, వేసవి పానీయాలు, రకరకాల పద్ధతుల్లో శారీస్ ధరించే శారీస్ స్టైలింగ్, మోడ్రన్ హెయిర్ స్టైలింగ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్టాల్స్, పోటీలు రిజిస్ట్రేషన్ కోసం 99084 20819, 97041 88316 నంబర్లుకు ఫోన్ చేయాలన్నారు.

దంతాలను ఆరోగ్యంగా ఉంచుకోవాలి

భీమవరంటౌన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : దంతాలు బాగుంటేనే ఆరోగ్యం బాగుంటుందని దంత వైద్యుడు ఎస్. గౌతమ్ అన్నారు. శ్రీ విజ్ఞానవేదిక ఆధ్వర్యంలో భీమవరం 32 డెంటల్ హాస్పటల్‌లో దంత వైద్య దినోత్సవం సందర్భంగా ఉచిత దంత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ గౌతమ్ మాట్లాడుతూ మనదేశంలో చాలామంది దంత సంరక్షణపై నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. సుమారు 50 మందికి దంత పరీక్షలు చేశారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి ఆయనను సత్కరించారు.

వికసిత భారత్ సాధన దిశగా యూబీఐ

తాడేపల్లిగూడెం రూరల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ ఆశయ సాధన కోసం వికసిత భారత్ లక్ష్య సాధన దిశగా యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో చిన్న, మధ్య తరహా సూక్ష్మ పరిశ్రమలను ప్రోత్సహించేందుకు ఎంఎస్ఎంఈ రుణ మేళా నిర్వహిస్తున్నామని ఆ బ్యాంకు కేంద్ర జనరల్ మేనేజర్ జీఎస్‌వి రమణ పేర్కొన్నారు. రీజియన్ పరిధిలోని పలు బ్రాంచిల్లో ఔత్సాహికులకు రుణమేళా చెక్‌లు అందించారు. రీజనల్ హెడ్ నాంపల్లి శ్రీనివాస్, డిప్యూటీ రీజనల్ హెడ్‌లు ఎస్. కిరణ్‌కుమార్, సంతోష్, సాకేత్, లీడ్ బ్యాంకు మేనేజర్ ఎ.నాగేంద్ర ప్రసాద్, జిల్లా పరిశ్రమల కేంద్రం మంగపతిరావు తదితరులు పాల్గొన్నారు.

టీబీ విముక్త గ్రామంగా మండపాక

తణుకు రూరల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండపాక గ్రామాన్ని టీబీ విముక్త గ్రామంగా ప్రకటించినట్టు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ భానూ నాయక్ తెలిపారు. గురువారం మండపాక గ్రామాన్ని సందర్శించిన ఆయన మాట్లాడుతూ గత ఏడాది కాలంగా మండపాక గ్రామంలో నిర్వహించే టీబీ సర్వేలో ఒక్క కేసు కూడా నమోదు కాలేదన్నారు. అందువల్ల గ్రామాన్ని టీబీ రహిత గ్రామంగా ప్రకటిస్తున్నట్లు తెలిపారు. జిల్లా ప్రోగ్రాం కోఆర్డినేటర్ విద్యానంద్, ట్రీట్‌మెంట్ సూపర్‌వైజర్ చైతన్య రవి, సర్పంచ్ జానా వెంకట లక్ష్మి, పంచాయతీ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య, ఔషధ రంగాల్లో ఏఐ కీలకం

తణుకు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ వైద్య, ఔషధ రంగాల్లో ప్రముఖ పాత్ర పోషిస్తుందని ఆదికవి నన్నయ్య వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.సుధాకర్ అన్నారు. గురువారం ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాలలో జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ మందులు శరీర తత్వాన్ని బట్టి మోతాదును ఉపయోగించుకోవాలని వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ నాణ్యత ప్రమాణాలను పాటించాలని చెప్పారు. విశిష్ట అతిథి, హైద్రాబాదు క్రోమోజనిక్ లైఫ్ సైన్సు మేనేజర్ డా. ఎస్. శ్రీనివాస్ మాట్లాడుతూ ఎక్కువ మొత్తంలో యాంటిబయోటిక్స్ వాడితే మూత్ర పిండాలు పాడవుతాయన్నారు. పలువురు అధ్యాపకులు పత్ర సమర్పణ చేశారు. ప్రిన్సిపల్ యు.లక్ష్మీ సుందరీబాయ్, కార్యదర్శి చిట్టూరి సత్య ఉషారాణి, డాక్టర్ కె.వెంకటరెడ్డి, డాక్టర్ ఎం.శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

ప్యాడ్లు, పెన్నుల వితరణ

తణుకు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులు ఒత్తిడికి లోను కాకుండా చదవాలని కౌన్సిలర్ డా. కె.ఆనంద్ అన్నారు. గురువారం ఎన్టీఆర్ పార్కు ఎదురుగా గల ఏకేటీపీ స్కూలు టెన్త్ విద్యార్థులకు పరీక్షల ప్యాడ్‌లు, స్కేలు, పెన్నులు అందజేసారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు కలగర వెంకట కృష్ణ, హెచ్‌ఎం రామకృష్ణ, సిర్రా సుదాకర్, సిర్రా బ్రహ్మయ్య, చదలవాడ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వేకు రైతులు సహకరించాలి

అత్తిలి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : రీ సర్వేలో భాగంగా జరిగే గట్ల నిర్ధారణలో సర్వే బృందాలకు సహకరించాలని అత్తిలి తహసీల్దార్ దశిక వంశీ కోరారు. అత్తిలిలో 5,423 ఎకరాలకు రీ సర్వే చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు 3 వేల ఎకరాలకు సర్వే పూర్తి అయినట్లు తెలిపారు. గట్ల నిర్ధారణలో రైతులు తమ పాస్ పుస్తకాలు, దస్తావేజులతో రావాలని కోరారు. అత్తిలిలో 12 బృందాలు పని చేస్తున్నట్లు తెలిపారు.

నరసాపురం పంట కాల్వకు సాగునీటి విడుదల

నరసాపురం రూరల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): నిడదవోలు పంటకాల్వ నుంచి నరసాపురం, మొగల్తూరు పంట కాల్వలకు గురువారం సాగునీటిని విడుదల చేసినట్లు ఇరిగేషన్ డీఈ వెంకటనారాయణ తెలిపారు. నాల్గో వంతును రైతులు సద్వినియోగపర్చుకోవాలన్నారు. అవసరాన్ని బట్టి చేలుకు నీటిని తీసుకున్న తరువాత దిగువ ప్రాంత రైతులకు నీటిని అందించాలన్నారు. ఎక్కడైన సాగునీటి ఇబ్బందులు ఉంటే అధికారులకు తెలియజేయాలన్నారు.

ధర్మారావు ఫౌండేషన్ సిమెంటు బస్తాల వితరణ

యలమంచిలి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): గంగడపాలెంలో అగ్నికుల క్షత్రియుల ఆధ్వర్యంలో నిర్మిస్తున్న కోదండరామాలయ నిర్మాణానికి ధర్మారావు ఫౌండేషన్ సిమెంట్ బస్తాలను సమకూర్చింది. ఫౌండేషన్ సభ్యుడు ఆరుమిల్లి రామశ్రీనివాస్ మాట్లాడుతూ ఫౌండేషన్ ఛైర్మన్ డాక్టర్ నిమ్మల రామానాయుడు ఎన్నికలకు ముందు ఆలయ నిర్మాణానికి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారని, హామీ మేరకు ఆలయ నిర్మాణానికి సిమెంట్ బస్తాలను అందించారని తెలిపారు. మల్లాడి ధర్మ, చిట్టూరి ఆంజనేయులు, కట్టా కృష్ణ, పీతల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మావుళ్ళమ్మకు బంగారం బహూకరణ

భీమవరం టౌన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మావుళ్ళమ్మ వారికి కోలమూరుకు చెందిన కూనపరాజు బాలాజీ రాజు దంపతులు 7 గ్రాముల బంగారం అందజేశారు. ఆలయానికి వచ్చిన దాతలు ముందుగా అమ్మవారిని దర్శించుకోగా అలయ ప్రధాన అర్చకులు మద్దిరాల మల్లికార్జున శర్మ పూజలు నిర్వహించి ఆశీర్వచనాలు అందించి శేషవస్త్రం ప్రసాదాలు అందించారు.

అలుగులమ్మకు జలాభిషేకం

ఉండి, మార్చి 6(ఆంధ్రజ్యోతి):అలుగులమ్మ జాతరను పురస్కరించుకుని మహిళలు అమ్మవారికి జలాభిషేకం నిర్వహించారు. జలాభిసేకంలో మహిళలు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. ఉత్సవాలను విజయవంతం చేయాలని ఉత్సవ కమిటీ కోరింది.



నామినేటెడ్ పదవుల కోసం.. ఎదురుచూపులు..

నరసాపురం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ స్థాయి నామినేటెడ్ పదవుల కోసం ఆశావహులు ఎదురు చూస్తున్నారు. ఈ ఏడాది జనవరిలో వీటిని భర్తీ చేయాలని పార్టీ అధిష్ఠానాలు భావించాయి. దానికి అనుగుణంగా జాబితాలు సిద్ధం చేసి స్థానిక నేతలు అధినాయకులకు సమర్పించారు. దీంతో అధిష్ఠానం ఎప్పుడు ఆమోద ముద్ర వేస్తుందోనని స్థానిక నేతలు ఎదురు చూస్తున్నారు. నియోజకవర్గంలో 12 సొసైటీలు ఉండగా పట్టణ పరిధిలోని సొసైటీని టీడీపీ సీనియర్ నాయకుడు అధికారి అనంత రామారావుకు, మల్లవరం, ఎల్‌బీ చర్ల, పేరుపాలెం, జగన్నాథపురం, కాళీపట్నం సొసైటీలు తెలుగుదేశం పార్టీకి, సీతారాంపురం, కొప్పర్రు, లక్ష్మణేశ్వరం, తూర్పుతాళ్ళు, కేపీపాలెం సొసైటీలు జనసేనకు తీసుకునేలా ఒప్పందానికి వచ్చాయి. సొసైటీ అధ్యక్షుల పేర్లను ప్రతిపాదిస్తూ జాబితాలను కూడా పంపారు. అలాగే అర్బన్ బ్యాంకు, ప్రభుత్వ ఆస్పత్రి, ఏఎంసీ కమిటీలను కూడా భర్తీ చేయాల్సి ఉంది. పండుగ తరువాత ఎమ్మెల్సీ కోడ్ రావడంతో వీటి భర్తీ నిలిచిపోయింది. ప్రస్తుతం ఎన్నికలు ముగిశాయి. మరో ఐదు రోజుల్లో కోడ్ కూడా ముగియనుంది. ఇటు పార్టీ అధినాయకులు కూడా ఈ నెలాకరులోపు అన్ని కమిటీలను భర్తీ చేస్తామని చెప్పడంతో కూటమి నాయకుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. జాబితా ప్రకారం తమకు దక్కుతుందా? లేదా చివరి క్షణంలో ఏమైనా మార్పులు చేర్పులు జరిగి తమను తప్పిస్తారా అన్న టెన్షన్ కూడా కొందరిలో నెలకొంది.

ఆచంట నియోజకవర్గంలో..

ఆచంట: నియోజకవర్గంలో నామినేటెడ్ పదవులపై చర్చలు ప్రారంభించారు. ముఖ్యంగా ఆచంట, పెనుగొండ ఏఎంసీ ఛైర్మన్ పదవుల పైనే ప్రతి ఒక్కరి దృష్టి ఉంది. ఈ రెండు పదవులు టీడీపీ, జనసేన నేతలకు దక్కే అవకాశాలు కనిపిస్తున్నప్పటికి ఛైర్మన్ పదవి మాత్రం రెండు చోట్లా టీడీపీకి దక్కే అవకాశం ఉందని వైస్ ఛైర్మన్ మాత్రం జనసేనకు దక్కే అవకాశాలు ఉన్నాయని పలువురు అంటున్నారు. అలాగే నియోజకవర్గంలో ఇంకా ప్రధాన ఆలయాలు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీలు, సొసైటీలు, ఇంకా అనేక నామినేటెడ్ పదవులు భర్తీ కానున్నాయి. టీడీపీ, జనసేనతోపాటు కూటమిలో బీజేపీ కూడా ఉండటంతో వారు కూడా నామినేటెడ్ పదవులు కోసం ఎదురు చూస్తున్నారు. నియోజకవర్గంలో జరిగే నామినేటెడ్ పదవులను స్థానిక ఎమ్మెల్యే ఆధ్వర్యంలో భర్తి చేయాల్సి ఉన్నందున ఈ పదవులు ఎవరికి వరిస్తాయోనని ఇప్పటికే నియోజకవర్గం వ్యాప్తంగా ఎవరికి వారే లెక్కలు వేసుకుంటున్నారు. ముఖ్యంగా అందరి దృష్టి ఆచంట , పెనుగొండ ఏఎంసీ ఛైర్మన్ పదవులు పైనే ఉంది.

బీఎస్ఎన్ఎల్.. సిగ్నల్ నిల్

పెనుమంట్ర, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : భారతీయ సంచార్ నిగం లిమిటెడ్ (బిఎస్ఎన్ఎల్) సెల్ఫోన్ సర్వీసెస్ కస్టమర్లకు సెల్ సిగ్నల్స్ లేక నాలుగు రోజులుగా మండలంలో పలు గ్రామాల ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు. బిఎస్ఎన్ఎల్ సంస్థ 3జి నుండి 5జి సేవలం దిస్తున్నామని ఆర్భాటంగా చెబుతున్నప్ప టికీ సెల్ సిగ్నల్ సేవలు అందించడంలోనే వైఫల్యం చెందిందని వినియోగదారులు వాపోతున్నారు. మండలంలోని విని యోగదారులకు బిఎస్ఎన్ఎల్ సేవలు గత మూడు రోజులుగా నిలిచిపోయాయి. దీంతో విని యోగదారులు అగచాట్లు పడుతున్నారు. ఎవరికి ఫిర్యాదు చేసిన స్పం దించక పోవడంతో కొందరు సోషల్ మీడియా వేది కగా సమాచారాన్ని వెల్లడించారు. పెనుమంట్ర ఆలమూరు బిఎస్ఎన్ఎల్ సిబ్బంది లేకపోవడంతోని పరిస్థితి ఏరడిందని పలువురు చెబుతున్నారు. ఇప్పటికైనా పాలకులు దృష్టి సారించి ప్రభుత్వ సెల్ సర్వీసులు వినియోగదారులకు అందుబాటులోకి తేవాలని కోరుతున్నారు.

నేడు కౌన్సిల్ సమావేశాలు

ఆకివీడు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : నగర పంచాయతీ ఆధ్వర్యంలో బడ్జెట్ ప్రత్యేక, కౌన్సిల్ సమావేశాలు శుక్రవారం ఉదయం నిర్వహిస్తామని కమిషనర్ కృష్ణమోహన్ గురువారం తెలిపారు. ఈ ఏడాది జనవరి 30న జరగాల్సిన సమావేశాలు కోడ్ కారణంగా వాయిదా పడడంతో శుక్రవారం నిర్వహిస్తున్నామన్నారు.

రేపు మండల పరిషత్ సమావేశం

ఆచంట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఆచంట మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం ఈ నెల 8వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎంపీపీ దిగుమర్తి సూర్య కుమారి అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వి. పూర్ణబాబ్జి తెలిపారు. సభ్యులతో పాటు అధికారులు విధిగా హాజరు కావాలని ఎంపీడీవో కోరారు.

నేడు ఆక్వా చెరువుల వేలం

ఆకివీడు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : మదనగోపాలస్వామి, భీమేశ్వరస్వామి దేవస్థానాలకు సంబంధించి ఆక్వా చెరువులు శుక్రవారం స్థానిక వేణుగోపాలస్వామి దేవస్థానం ప్రాంగణంలో బహిరంగ వేలం వేస్తున్నట్టు ఈవో వీఎస్ఎన్ రాజు గురువారం తెలిపారు. ఉదయం 10 గంటలు బహిరంగ వేలం ప్రారంభమవుతుందన్నారు.

రేపటి నుంచి సీపీఎం సైకిల్ యాత్ర

భీమవరం అర్బన్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సుమారు లక్ష కుటుంబాల వారు ఇళ్ళ సమస్యలను ఎదుర్కొంటున్నారని ఈ సమస్యపై మార్చి 8 నుంచి 16వ తేదీ వరకు సీపీఎం సైకిల్ యాత్ర నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి జేఎన్‌వీ గోపాలన్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సైకిల్ యాత్ర ముగియగానే ఈ నెల 17న జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తామన్నారు. సీపీఎం జిల్లా కార్యద ర్శివర్గ సభ్యుడు చింతకాయల బాబు పాల్గొన్నారు.

15న మండల పరిషత్ సమావేశం

పెనుమంట్ర, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 15న పెనుమంట్ర మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం కర్రి వెంకట్ నారాయణరెడ్డి అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో పి. సామ్యూల్ తెలిపారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ హాజరుకానున్నారని తెలిపారు. సమావేశానికి జెడ్‌పీటీసీ, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు హాజరుకావాలని తెలిపారు.

డ్రెయినేజీలను శుభ్రం చేయాలి

నరసాపురం టౌన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో దోమలు ప్రబలకుండా డ్రైనేజీలను శుభ్రం చేయాలని కమిషనర్ అంజయ్య అదేశించారు. గురువారం పలు వార్డుల్లో శానిటేషన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా వార్డుల ప్రజలు తాగునీరు సక్రమంగా రావడం లేదని, దోమల నివారణకు ఫాగింగ్ చేయడం లేదని కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. తక్షణం అన్ని వార్డుల్లో ఫాగింగ్ చేయాలని, తాగునీటి ఇబ్బందులు లేకుండా సిబ్బంది చూడాలని అదేశించారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ తదితరులు ఉన్నారు.

మహిళా దినోత్సవాన్ని విజయవంతం చేయాలి: జేసీ

భీమవరం టౌన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : అన్ని శాఖల సమన్వయంతో జిల్లాస్థాయి అంతర్జాతీయ మహిళా దినోత్సవం విజయవంతం అయ్యేలా ఏర్పాట్లు చెయ్యాలని జేసీ టి. రాహుల్ కుమార్ రెడ్డి ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో అధికారులు, పట్టణంలోని వివిధ కళాశాల ప్రతినిధులు, స్వచ్ఛంద సేవా సంస్థలతో సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ 8వ తేదీ ఉదయం 6-30 గంటలకు సుమారు 600 మంది మహిళలతో భారీ ర్యాలీ జరుగుతుందన్నారు. అనంతరం కాస్మోపాలిటన్ క్లబ్ లో సాంస్కృతిక కార్యక్రమాలు, వివిధ శాఖల స్టాల్స్ మహిళలకు ఉపకరణాలు పంపిణీ జరుగుతుందన్నారు. జిల్లాలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వివిధ కార్పొరేషన్ ఛైర్మన్లకు, పురపాలక సంఘం ఛైర్మన్‌లకు, ప్రముఖులకు అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఆహ్వాన పత్రికలు అందజేసి, ఆహ్వానం పలకాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాల్గొనే కార్యక్రమాన్ని జిల్లా స్థాయిలో ప్రత్యక్ష ప్రసారం చేసి అందరూ తిలకించేందుకు వీలుగా ఎల్ఈడీ స్క్రీన్లను ఏర్పా టు్ల చేయాలని సూచించారు. ర్యాలీకి సజావుగా సాగుటకు ట్రాఫిక్ అంతరాయం లేకుండా చూడా లన్నారు. మహిళలకు ఉపకరణాలు, చెక్కుల పంపిణీకి సిద్ధం చేసుకోవాలని సూచించారు. చల్లటి మంచినీటి క్యాన్లు, స్టీల్ గ్లాసులు ఏర్పాటుచేసి అడిగిన వారికి అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా అధికారులు పాల్గొన్నారు.



సమీక్ష నిర్వహిస్తున్న జేసీ రాహుల్ కుమార్ రెడ్డి

గురుకులాల్లో ప్రవేశాలకు ఆహ్వానం

పెనుగొండ, మార్చి 6(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాల్లో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రవేశానికి దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ టి.ఎస్తేరు క్వీని తెలిపారు. గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతి , ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి సంబంధించి దరఖాస్తులను ఈ నెల 13 వరకు స్వీకరించడం జరుగుతుందన్నారు.

గణపవరం డిగ్రీ కళాశాలకు ఏ గ్రేడ్

గణపవరం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): గణపవరంలోని చింతలపాటిమూర్తిరాజు ప్రభుత్వ డిగ్రీకాలేజీకి ఏగ్రేడ్ లభించినట్టు ప్రిన్సిపల్ నిర్మలకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం కళాశాలలో అకడమిక్ ఆడిట్ నిర్వహించి కళాశాలకు ఏ గ్రేడ్ ఇచ్చినట్టు తెలిపారు. వైస్ ప్రిన్సిపల్ మధురాజు పాల్గొన్నారు.

విజయవాడ తరలిన ఆశాలు

ఆకివీడు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : తమ సమస్యలు పరిష్కారం కోసం ఆశా వర్కర్లు గురువారం విజయవాడ తరలి వెళ్ళారు. విజయవాడ ధర్నా చౌక్‌లో నిరసనలు తెలియచేయడానికి ఆకివీడు నుంచి ఆశాలు రైలు, బస్సులు, కార్ల ద్వారా చేరుకున్నారు. కూటమి నేతల వాగ్దానం మేరకు తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్‌చేశారు.

శివనామ స్మరణతో మార్మోగిన పూలపల్లి

పాలకొల్లు రూరల్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): పూలపల్లిలో అన్నపూర్ణా అమృతలింగేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవం గురువారం ఘనంగా జరిగింది. స్వామివారికి అభిషేకం, అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మ కర్తలు గొట్టుముక్కల గాంధీభగవాన్‌రాజు సుశీలా దేవి దంపతులు, కమిటీ సభ్యులు వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక సంధ్య మెరైన్ సంస్థ ఆర్థిక సాయంతో అఖండ అన్నసమారాధన నిర్వహించారు. భగవాన్‌రాజు భక్తులకు అన్న ప్రసాదం వడ్డించారు. పూలపల్లిలో గాంధీభగవాన్ రాజు దంపతులు 2019లో గ్రామంలో శివాల యాన్ని నిర్మించి స్వామి, అమ్మవార్ల విగ్రహాలను ప్రతిష్ఠించి ధర్మకర్తలుగా వ్యవహరిస్తున్నారు.

జనసేన ఆవిర్భావ దినోత్సవం విజయవంతం చేయాలి

పెంటపాడు, మార్చి 6(ఆంధ్రజ్యోతి): ఈ నెల 14న పిఠాపురంలో నిర్వహించే జనసేన ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని జనసేన నాయకుడు బొలిశెట్టి రాజేష్ అన్నారు. గురువారం పెంటపాడులో మండల అధ్యక్షుడు పుల్లా బాబి అధ్యక్షతన పార్టీ శ్రేణులతో జరిగిన సమావేశంలో రాజేష్ మాట్లాడుతూ ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తుల తరలి రావాలన్నారు. కొవ్వూరి లక్ష్మణరెడ్డి, కొన కళ్ళ హరినాథ్, కసిరెడ్డి మధులత తదితరులు పాల్గొన్నారు.



కేంద్ర మంత్రి గడ్కరీతో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ

త్వరలో ఆకివీడు- దిగమర్రు బైపాస్ రోడ్డు నిర్మాణ పనులు

భీమవరంటౌన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): త్వరలో ఆకివీడు- దిగమర్రు బైపాస్ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమవుతాయని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయక మంత్రి భూపతి రాజు శ్రీనివాస్ వర్మ తెలిపారు. సీఎం చంద్రబాబు, ఇతర ఎన్డీయే మంత్రులు, ఎంపీలతో కలిసి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని మర్యాదపూర్వకంగా డిల్లీలో కలిసి రాష్ట్రానికి సంబంధించిన వివిధ జాతీయ రహదారుల నిర్మాణంపై చర్చించామన్నారు. ఇప్పటికే కేంద్రం అనుమతించిన ఆకివీడు - దిగమర్రు (ఎన్‌హెచ్-165) బైపాస్ రోడ్డు నిర్మాణ పనులకు నిధులు విడుదల చేయాలని గడ్కరీ దృష్టికి తాను తీసుకెళ్లానన్నారు. జిల్లా వాసులు ఎదురు చూస్తున్నా బైపాస్ రోడ్ నిర్మాణానికి సంబంధించి భూ సేకరణ, నిర్మాణ పనులు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించాలన్న తన విజ్ఞప్తికి మంత్రి గడ్కరీ స్పందించి వెంటనే అ ధికారులకు తగు ఆదేశాలిచ్చారని, త్వరలోనే బైపాస్ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించి పూర్తి చేస్తామని ఆయన తెలిపారు.

అధ్యక్షా..

సీజ్ చేసిన రేషన్ బియ్యం ఎక్కడికెళుతున్నాయి

అసెంబ్లీలో ఎమ్మెల్యే ఆరిమిల్లి



తణుకు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): దాడుల్లో సీజ్ చేసిన రేషన్ బియ్యం ఎక్కడకు వెళుతున్నాయని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ప్రశ్నించారు. గురువారం శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 9వేల664 కేసులు ద్వారా సీజ్ చేసిన సుమారు 76వేల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ఎవరు కొనుగోలు చేస్తున్నారు, తిరిగి ఆ బియ్యం ఎక్కడుకు వెళుతున్నాయో సమీక్షించాలన్నారు. ఆక్షన్‌లో కొనుగోలు చేస్తున్న ట్రేడర్లు రీసైక్లింగ్ చేస్తున్నారని చెప్పారు. రేషన్ బియ్యం ప్రజలు వండుకుని తినేలా మార్పులు తీసుకురావాలని తెలిపారు. మంత్రి నాదెండ్ల మనోహర్ ఇన్‌చార్జిగా ఉన్న ఏలూరు జిల్లాలో ఎంత బియ్యం సీజ్ చేశారు.. కొనుగోలు చేసిన ట్రేడర్లు ఎవరని ప్రశ్నించారు. 2022-24 మధ్య కాలంలో అప్పటి పౌరసరఫరాల మంత్రిగా పనిచేసిన కారుమూరి కనుసన్నల్లోని కొంతమంది వ్యక్తులే ఈ బియ్యాన్ని కొనుగోలు చేసినట్లు తెలుస్తుందన్నారు. దీనిపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలన్నారు. 2014-19 కాలంలో ఉండ్రాజరం జంక్షన్, తేతలి వైజంక్షన్‌లో నిర్మించే ఫ్లైఓవర్ పనులు వెంటనే పూర్తి చేయాలి. పనులు 60 శాతం మేర కూడా పనులు జరగలేదు. సర్వీసు రోడ్డు కూడా అధ్వానంగా ఉన్నాయి. అక్కడ కాంట్రాక్టర్లకు ఉన్న ఇబ్బందులు ఏమిటో సమీక్షించి వేగవంతం చేయాలన్నారు.

సీసీ రోడ్లు వేస్తానంటేనే అనుమతులివ్వండి

అసెంబ్లీలో ఎమ్మెల్యే అంజిబాబు



భీమవరం టౌన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : తన నియోజకవర్గంలో సీసీ రోడ్లు వేస్తానంటేనే అనుమతులు ఇవ్వాలని, తారు రోడ్లు వేస్తానంటే తమకు వద్దని ఎమ్మెల్యే పులపర్తి అంజిబాబు అసెంబ్లీ సమావేశంలో గట్టిగా మాట్లాడారు. తారు రోడ్లు వేస్తుంటే .. బిల్లులు పెట్టుకునే లోపే గుంతలు పడిపోతున్నాయని, డెల్టా ప్రాంతంలో సీసీ రోడ్లు వేయాలని ఆర్‌అండ్‌బీ మంత్రిని కోరారు. అదే విధంగా గ్రామాల్లో రోడ్లు వేస్తున్నా డ్రెయిన్లు లేక మురుగునీరు నిలిచిపోతుందని, గ్రామంలో డంపింగ్ యార్డులు లేక చెత్తాచెదారాలను ఎక్కడపడితే అక్కడ వేస్తున్నారని, అందువల్ల డంపింగ్ యార్డులను ఏర్పాటు చేయాలని కోరారు. పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని ఎమ్మెల్యే కోరారు. ప్రభుత్వం రైతులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

క్రైమ్ కార్నర్

రైల్వే గేటును ఢీకొన్న స్కూల్ బస్సు

పాలకోడేరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): వేంద్ర రైల్వే గేటును గురువారం సాయంత్రం ఒక స్కూల్ బస్సు ఢీ కొట్టడంతో రైల్వే గేటు విరిగిపోయింది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి గాయాలు కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. ప్రైవేట్ స్కూల్ బస్సు రైల్వే గేటును ఢీకొట్టడంతో గేటు సగభాగం ట్రాక్‌పై పడింది. ఇదే సమయంలో కాకినాడ వైపు నుంచి భీమవరం వస్తున్న సర్కార్ ఎక్స్‌ప్రెస్ మరో ట్రాక్ మీద నుంచి వెళ్ళిపోవడంతో ఎటువంటి ప్రమాదం జరగలేదని స్థానికులు అంటున్నారు. అక్కడే ఉన్న స్థానికులు రైల్వే గేటుకు మరమ్మతులు చేపట్టడంతో స్కూల్ బస్సు కూడా పిల్లలను దింపేందుకు వెళ్ళిపోయింది. రైల్వే అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో ఒకరి మృతి

భీమవరం క్రైం: తాపీ వర్కర్ విద్యుదాఘాతానికి గురై మృతి చెందిన సంఘటన పట్టణంలో చోటు చేసుకుంది. టూటౌన్ ఎస్ఐ రెహ్మాన్ వివరాల ప్రకారం భీమవరం మండలం రాయలం గ్రామానికి చెందిన మహంతి గోవిందరావు (37) గొల్లవానితిప్ప రోడ్డులో తాపీ పనికి బుధవారం వెళ్ళాడు. అయితే అక్కడ డ్రెయినేజీపై రాళ్ళు పరుస్తూ ఉండగా అతనికి కరెంట్ తీగ తగిలి షాక్‌కు గురయ్యాడు. వెంటనే అంబులెన్స్ ద్వారా భీమవరం ఆసు పత్రికి తరలించగా అతను మృతిచెందినట్టు వైద్యులు నిర్ధారించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో..

ఆకివీడు రూరల్: దుంపగడపలోని శ్రీచైతన్య స్కూల్ సమీపంలో జాతీయ రహదారిపై గురువారం జరిగిన ప్రమాదం లో మద్దా మరియదాసు (38) అక్కడికక్కడే మృతి చెందాడు. ఆకివీడు ఎస్ఐ నాగరాజు తెలిపిన వివరాలు మేరకు ఏలూరు జిల్లా కైకలూరు మండలం పెదకొట్టాడకు చెందిన మద్దా మరియదాసు (38) ఫిష్ ప్యాకింగ్ పనులు చేస్తుంటాడు. అతడికి భార్య ముగ్గురు కుమారులున్నారు. గురువారం తన తోడల్లుడి కుమారుడి దిన కార్యక్రమానికి అత్తిలి మండలం కొమ్మర గ్రామానికి మోటార్ సైకిల్‌పై వెళ్లాడు. తిరిగి ఇంటికి వెళుతుండగా కైకలూరు నుంచి ఆకివీడు వైపు వస్తున్న లారీ ఢీ కొంది. ఈ ప్రమాదంలో మరియదాసు అక్కడికక్కడే మృతి చెందాడు. అతడి భార్య ఉపాధి నిమిత్తం గల్ఫ్‌లో ఉంటోంది. ఎస్ఐ నాగరాజు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


CELEBRATING
26
YEARS OF
VIJETHA
ANNIVERSARY
CELEBRATIONS
విజేత
Fresh Healthy Living
CABBAGE
PER KG Vijetha Price ₹12
TOMATO LOCAL
PER KG Vijetha Price ₹15
CAULIFLOWER
PER PC Vijetha Price ₹16
KHEERA
PER KG Vijetha Price ₹24
CARROT
PER KG Vijetha Price ₹25
BEET ROOT
PER KG Vijetha Price ₹25
POTATO
PER KG Vijetha Price ₹26
ONION RED
PER KG Vijetha Price ₹36
GINGER
PER KG Vijetha Price ₹49
KIRAN MELON
PER KG Vijetha Price ₹16
KHARBUJA (MUSK MELON)
PER KG Vijetha Price ₹35
MOSAMBI
PER KG Vijetha Price ₹54
GRAPES GREEN SEEDLESS PUNET
PER PUNET Vijetha Price ₹59
ORANGE NAGPUR
PER KG Vijetha Price ₹79
SUGAR PREMIUM
1 KG PACK Vijetha Price ₹49
TOORDAL PREMIUM
1 KG PACK Vijetha Price ₹149
URAD ROUND PREMIUM
1 KG PACK Vijetha Price ₹149
GROUNDNUT PREMIUM
1 KG PACK Vijetha Price ₹168
BASMATHI RICE
1 KG PACK Vijetha Price ₹99
AADHAAR SUNFLOWE OIL 1LTR POUCH
MRP ₹ 188 Vijetha Price ₹139 ONLY
RAAGA SUNFLOWER OIL 1LT POUCH
MRP ₹ 165 Vijetha Price ₹139 ONLY
SAFFOLA OIL GOLD 5LT
GET 5KG AASHIRVAAD POPULAR ATTA WORTH ₹355/-
MRP ₹ 1182 Vijetha Price FREE
GOLD DROP SUNFLOWER OIL 1 Ltr POUCH
MRP ₹ 165 Vijetha Price ₹147 ONLY
SAFFOLA OIL ACTIVE 1LT
MRP ₹ 197 Vijetha Price ₹138 ONLY
ORIGINAL KIMIA DATES 400G BOX
MRP ₹ 310 Vijetha Offer BUY 1 GET 1 FREE
COCOJAL TENDER COCONUT WATER 200ML
MRP ₹ 55 Vijetha Offer BUY 1 GET 1 FREE
BNATURAL JUICE 1LT
(APPLE/GUAVA/MIXED FRUIT MRY/ORANGE)
MRP ₹ 140 Vijetha Offer BUY 1 GET 1 FREE
COCO ROYAL BASIL SEED 290ML (ENTIRE RANGE)
MRP ₹ 99 Vijetha Offer BUY 1 GET 1 FREE
MAAZA MANGO PET 1.75LT
MRP ₹ 105 Vijetha Offer ₹30 OFF ON MRP
MINUTE MAID PET PULPY ORANGE 1LT
MRP ₹ 90 Vijetha Offer ₹15 OFF ON MRP
COKE ZERO SUGAR PET 750ML
MRP ₹ 45 Vijetha Offer BUY 1 GET 1 FREE
SUNFEAST MOMS MAGIC CASHEW&ALMOND COOKIES 94.5G
MRP ₹ 35 Vijetha Offer BUY 1 GET 1 FREE
SUNFEAST YIPPEE NOODLES MAGIC MASALA 280G
MRP ₹ 56 Vijetha Offer ₹20 OFF ON MRP
TAJ MAHAL TEA LEAF 500G
MRP ₹ 470 Vijetha Offer ₹75 OFF ON MRP
PARACHUTE ADVANCED GOLD COCONUT HAIR OIL 500ML
MRP ₹ 400 Vijetha Offer BUY 1 GET 1 FREE
PARACHUTE COCONUT OIL 600ML
MRP ₹ 305 Vijetha Offer ₹75 OFF ON MRP
SURF EXCEL MATIC LIQUID FRONT LOAD4LTR
MRP ₹ 885 Vijetha Offer ₹265 OFF ON MRP
SURF EXCEL SOAP200G*4 BAR 800G SET
MRP ₹ 125 Vijetha Offer ₹20 OFF ON MRP
VIM ANTI SMELL BAR 5X200G
MRP ₹ 130 Vijetha Offer ₹40 OFF ON MRP
PONDS TALC MAGIC / DREAM FLOWER 400G / SANDAL 300G
MRP ₹ 300-459 Vijetha Offer BUY 1 GET 1 FREE
VIM DROP LIQUID LEMON 2LT POUCH
MRP ₹ 405 Vijetha Offer ₹70 OFF ON MRP
MANGALDEEP AGARBATHI SANDLE 160 STICKS
MRP ₹ 120 Vijetha Offer BUY 1 GET 1 FREE
OFFERS VALID FROM 7th TO 9th MARCH 2025 ONLY. VISIT OUR STORE FOR MANY MORE OFFERS
VIJETHA
Fresh Healthy Living
Vijetha Supermarkets Pvt. Ltd.
Telangana • Andhra Pradesh
Juvvalapalem Road, Beside Bharat Petrol Pump, Balusumoodi,
Bhimavaram, Andhra Pradesh 534202 Ph.: 73373 23513
vijethasupermarkets
VijethaSuperMarketsPvtLtd
SINCE 1999